www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 44 సంచిక : 4 విజయవాడ 20-6-2011 పేజీలు : 8 వెల: రు 5.00

లోపలి పేజీల్లో...

- వివిధ దేశాల కార్మికుల ఆందోళనలు
- మనుగోపుల, కుంకాల ప్రాంత భూ పోరాటం– ఇటీవలి పరిణామాలు
- దేశంలో సర్వసంపదలను బహుళజాతి, బడాపరిశ్రమలపరం చేస్తున్న పాలకులు
- కౌలు రైతులను మరోసారి వంచించిన ఆర్డినెన్స్
- కాంట్రాక్టు సాగు దోపిడీ పద్ధతికి గురౌతున్న పామాయిలు రైతాంగం

# సంక్షోభానికి పరిష్కారం చూపని పాలక వర్గాలు

**రైతాంగమెదుర్కొంటున్న** సమస్యలు నానాటికీ తీవ్రమౌతున్నాయి. వాటికి పరిష్కారం మాత్రం దరిదాపుల్లో కనిపించటంలేదు. అధికారంలోవున్న పాలకవర్గ పార్టీలు ప్రదర్శనాత్మక చర్యలూ, ప్రకటనలతో రైతాంగంలోని అసంతృప్తిని జోకొడుతుండగా, ప్రతిపక్షంలోని పాలకవర్గ పార్టీలు దృష్టిని మళ్లించే తాత్కాలిక నినాదాలతో రైతాంగాన్ని తాము అధికారం పొందే రాజకీయాలలో పావులుగా వాడుకోజూస్తున్నాయి. నేడు ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ సంరంభమంతా ఈ పరిస్థితికి అద్దం పడుతున్నది.

1991–92 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభ దశలో వుందని గత టిడిపి ప్రభుత్వం అధికారికంగా అంగీకరించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు పార్టీ కూడా దీనినే అంగీకరించి, దీనిని పరిష్కరించి తమది రైతు ప్రభుత్వంగా నిరూపించుకుంటామని చెప్పింది. ఏడేళ్లు గడచినా రైతాంగమెదుర్కొంటున్న ఏ సమస్యా పరిష్కారం కాలేదు. ప్రభుత్వం ప్రకటించిన ఏ పథకమూ రైతాంగానికి ఊరట కల్గించలేదు. కాగా ప్రతిపక్షంలోవున్న టిడిపి రైతుకు న్యాయం జరిగేవరకూ పోరాడుతానని రంకెలు వేసింది తప్ప సమస్యల పరిష్కారానికి ఎలాంటి విధానాన్నీ ప్రకటించలేదు. తీవ్రమైన సమస్యపై ఆందోళనకు దిగిన రైతాంగంతో పాటు తానూ నినదించటమే తప్ప ఒక రాజకీయ పార్టీగా సమస్యలను పరిష్కరించే వ్యవసాయ విధానాన్ని అది రైతాంగం ముందుంచటంలేదు. ఇక వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు దీక్షలను తన బల ప్రదర్శనకు వేదికలు చేసుకున్నది తప్ప ఒక విధానాన్ని తెలిపే ప్రయత్నాన్నికూడా చేయటం లేదు. పార్లమెంటరీ పార్టీలేవీ రైతాంగమూ, వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభపు మూలాలలోకి వెళ్ళకుండా, తత్కాల నినాదాలతో, ప్రదర్శనాత్మక చర్యలతో కాలం వెళ్ళబుచ్చుతున్నాయి.

గ్రామీణ భారతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య భూమి హీనత–దానితో ముడిపడి వున్న అసమానత్వం. గ్రామాలలో భూమి లేని వ్యవసాయ కూలీల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. 1971లో 4 కోట్ల 75 లక్షలున్న వ్యవసాయ కూలీలు 2001 నాటికి 10 కోట్ల 68 లక్షలకు పెరిగారు. శాతాలలో చూస్తే 37.8 నుండి 48.6కు పెరిగారు. కాగా ఈ కాలంలో జనాభా పెరుగుదల రేటు 2.74 శాతంకాగా, వ్యవసాయకూలీల పెరుగుదల రేటు 2.07 శాతంగా వుంది. ఈ గణాంకాలు తెలిపేదేమంటే గ్రామీణ కుటుంబాలు ప్రధానంగా వ్యవసాయ కూలీ కుటుంబాలుగానే వున్నాయి తప్ప వారికి వ్యవసాయేతర రంగంలో ఉపాధి లభించటంలేదు. స్థూల జాతీయవుత్పత్తి, అర్థికాభివృద్ధి రేటు ఎంత పెరిగినా వీరి జీవితాలలో మార్పేమీలేదు. ఇవి పెరిగినంతగా ఉపాధి అవకాశాలు పెరిగి వారి జీవనం మెరుగు పడుతుందన్న ప్రభుత్వవాదన బూటకం తప్పమరేమీకాదు. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు గ్రామాలలో (గుంటూరు జిల్లా, కొల్లూరు మండలం అనంతారం; అనంతపురం జిల్లా, రాప్తాడు మండలం బుక్కచెర్ల; కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లె) మధుస్వామినాథన్ తదితరులు జరిపిన అధ్యయనం వాస్తవ స్థితిని తెలిపింది. అనంతారంలో 67 శాతం, కొత్తపల్లెలో 47 శాతం, బుక్క చెర్లలో 15 శాతం కుటుంబాలకు భూమిలేదు. భూమి హీనత నానాటికీ పెరుగుతూ వస్తున్నదని కూడా ఈ అధ్యయనం కనుగొంది. ఉదాహరణకు అనంతారంలో (కా॥ పుచ్చలపల్లి సుందరయ్య భూ సంబంధాలను అధ్యయనం చేసిన గ్రామం) 1974లో 50 శాతం కుటుంబాలకు భూమి లేదు; 2005లో అది 60 శాతానికి పెరిగింది. అలాగే ఈ గ్రామంలో కౌలు చేస్తున్న కుటుంబాలు 18 శాతం (1974లో) నుండి 37 శాతానికి (2006లో) రెట్టింపుకాగా, కౌలుకిస్తున్న భూమి 22 శాతం నుండి 67 శాతానికి పెరిగింది. అలాగే పేద రైతుల, కౌలు రైతుల, రుణగ్రస్తత ఊహించలేని స్థాయిలో పెరిగిందని కూడా ఈ అధ్యయనం తెలిపింది. ఈ వ్యవసాయ కూలీలుగా వున్న దళితులు, ఆదివాసులు, ముస్లిముల ఆదాయాలు హీనస్థాయిలో వున్నాయని ఈ అధ్యయనం తెలిపింది. మూడు ప్రాంతాలలోనూ ఆదివాసులు, ముస్లింల సాలుసరి తలసరి ఆదాయం రూ. 4407 నుండి 4831 వరకూ వుండగా, దళితుల ఆదాయం రు॥ 8,840గా వుంది. అదే కౌలు, పేద, మధ్య తరగతి రైతాంగపు ఆదాయం హెక్టారుకు 10 వేలుగా వుంది. కౌలు రైతులు చెల్లిస్తున్న కౌలు మొత్తం వ్యవసాయ ఖర్చుల్లో అనంతారంలో 31 శాతంగానూ, బుక్కచెర్లలో 20 శాతంగానూ, కొత్తపల్లెలో 17 శాతంగానూ వుంది. ఫలితంగా అనంతారంలో కౌలు రైతాంగం వరి పండిస్తే సగటు హెక్టారుకు రు॥ 6733 నష్టపోతున్నారు. ఈ గణాంకాలూ, వాటితో ముడిపడ్డ సైద్ధాంతిక పదబంధాలు లేకుండా, సూటిగా పరిస్థితిని చెప్పాలంటే, ఆర్థిక సంస్కరణల ముందు కాలంలో ఆకలి నుండి నేడు తీవ్ర ఆకలితో వ్యవసాయ కూలీలు, పేదరైతాంగంలోని స్త్రీలు, పిల్లలు, పురుషులు కూడా నిద్రకుపక్రమిస్తున్నారు. ఈ పరిస్థితి దేశంలో భూసంస్కరణల అమలు వైఫల్యాన్ని తెలుపటంతో పాటుగా, దున్నేవానికే భూమి ప్రాతిపదికగా భూమి పంపకం జరిగితేనే తప్ప రైతాంగ సమస్య పరిష్కారం కాదనికూడా తెలుపుతున్నది.

ఇక భూమి వున్న రైతాంగం పరిస్థితి చూద్దాం. రైతు కుటుంబాల, వ్యక్తుల తలసరి ఆదాయాలు విభ్రాంతికరంగా వున్నాయని పై అధ్యయనం తెలిపింది. రైతాంగపు సగటు సాలుసరి తలసరి ఆదాయం కొత్తపల్లెలో రూ॥ 5895, బుక్కచెర్లలో రూ॥ 6308, అనంతారంలో రు॥ 8537గా వుందని తెలిపింది. సగటు దినసరి తలసరి ఆదాయంగా లెక్కిస్తే, కొత్తపల్లెలో 16రూ॥, బుక్కచెర్లలో 17 రు॥, అనంతారంలో 23 రు॥లుగా వుంటుంది. అయితే ఇవి సగటు లెక్కలనీ, ఆదాయ పంపిణీలో తీవ్ర అసమానత వుందనీ కూడా అధ్యయనం పేర్కొంది. అనంతారంలో 10 శాతంగా వున్న పెద్ద కుటుంబాలు మొత్తం కుటుంబాల ఆదాయంలో 52 శాతం పొందుతుండగా, మిగిలిన రెండు గ్రామాల్లోనూ 42 శాతం ఆదాయాన్ని పొందుతున్నాయి. కాగా మరో చివరన 40 శాతంగా వున్న క్రింది కుటుంబాలు 7 నుండి 9 శాతం ఆదాయాన్ని మాత్రమే పొందుతున్నాయి. అంటే భూమివున్న రైతాంగంలో కూడా భూమి యజమాన్యంలో అసమానత్వం ప్రధాన సమస్యగా వుంది.

ఈ భూమి సమస్య మరొక రూపంలో కూడా తీవ్రమైంది. అది అభివృద్ధి పేరిట సాగుతున్న దాడి. ఈ "అభివృద్ధి"వల్ల ఎందరు బాధితులయ్యారో, నిర్వాసితుల సమస్యల గురించి అధికారిక గణాంకాలు లేవు. అనధికార అధ్యయనాల అంచనాల ప్రకారం 6 నుండి 10 కోట్ల మంది నిర్వాసితులైనట్లు, రెండున్నర నుండి నాలుగు కోట్ల హెక్టార్ల భూమి, అందులో సగం సాగు భూమి కోల్పోయినట్లు తెలుపుతున్నాయి. ఈ "అభివృద్ధి" దాడి రూపకర్తలూ, లబ్ధిదారులూ సామ్రాజ్యవాదం, దళారీ బూర్జువావర్గమన్నది స్పష్టమే.

ఈ దాడి భూములనుండి రైతాంగాన్ని బలవంతంగా తొలిగించటంతోనే ప్రారంభంకాలేదు. ఎరువులు, పురుగుమందులు, అధిక దిగుబడి వంగడాలతో సస్యవిప్లవంతో ప్రారంభమైంది. ఈ చొరబాటు జన్యుమార్పిడి విత్తనాలతో తీవ్రమైంది. ఈ చొరబాటు సంపూర్ణమవటానికి సంస్థాగతంగా వున్న ఆటంకాలను (భూ సంస్కరణ చట్టాల సవరణల ద్వారా) పాలకులు తొలగించారు. పశ్చిమ బెంగాలులోని వామపక్ష ప్రభుత్వం కూడా ఈ చొరబాటుకు వీలుగా సవరణలను ప్రతిపాదించింది. వీటి ఆధారంగా కంపెనీలు ఎంత భూమిని స్వాధీనం చేసుకున్నాయన్న (తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

# టీకాల తాత్పర్యం

**ఇటీవలి** కొద్దిరోజులుగా పిచ్చికుక్క కాటుతో రాష్ట్రంలో సంభవిస్తున్న మరణాలు వార్తలుగా రూపుదిద్దుకున్నాయి. చిలవలు పలవలుగా వ్యాఖ్యానాలూ వచ్చాయి. ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం, చేతగాని ప్రభుత్వం తదితర వ్యాఖ్యానాలతో హోరెత్తించారు. దీనిలో తానేమీ తీసిపోనన్నట్లు ప్రభుత్వం కుక్కల లెక్కలు తీయటానికీ, వాటిలో వ్యాధిపాలైన కుక్కలకు టీకాలు వేయటానికి విధానాలు రూపొందించేందుకు కమిటీని నియమించింది. కుక్కల కమిటీపై మళ్లీ పోటీపడిమరీ వ్యాఖ్యానాలు వచ్చాయి. పిచ్చికుక్క కరచిన నిర్భాగ్యుడికి టీకా వెయ్యలేని స్థితికి కారణమేమిటో మాత్రం ఈ చర్చల్లో చోటు చేసుకోలేదు.

టీకాల సంబంధిత సమస్యలను ఈ సందర్భంగా లోతుగా చర్చించాల్సివుంది. సమయానికి టీకాలు అందుబాటులో లేక, ఉన్నా వాటి ఖరీదు సామాన్యుడికి అందుబాటులో లేక దుర్మరణాలు ఒకవైపున సాగుతుండగా, టీకాలు వికటించి పసిపిల్లలు మరణిస్తున్న దుర్ఘటనలు కూడా మరోవైపున సాగుతున్నాయి. వీటికి తోడు కొత్తటీకాలు కనుగొనటానికి ప్రయోగాలతో మరికొన్ని మరణాలు సంభవిస్తున్నాయి. బాధ్యతగల ఏ ప్రభుత్వమైనా ఈ పరిస్థితిని సమీక్షించుకుని సురక్షితమైన విధానాన్ని రూపొందిస్తుంది. సామ్రాజ్యవాదులకూ, దోపిడీ వర్గాలకూ సేవ చేయటమే పరమావధిగా గల భారత పాలకులు దీనికి భిన్నంగా వ్యవహరిస్తూ భారత ప్రజల ఆరోగ్యానికీ, ప్రాణాలకూ హాని కలిగిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారమే 2008–2010 మధ్య మూడేళ్లకాలంలో కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రులలో టీకా సంబంధిత పసిపిల్లల మరణాలు 522. మిగిలిన ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రులలో సంభవించిన మరణాలలో యివి 15 శాతం మాత్రమే. అంతకు ముందు ఏడేళ్ళ కాలంలో జరిగిన మరణాల కంటే ఈ మూడేళ్లలో మరణాలు రెట్టింపుగా వున్నాయి. ఇంతేకాక 2001 వరకూ ఇలాంటి మరణాలు లేవనీ, 2002లో 6 మరణాలు, 2003లో 13 మరణాలుగా పెరుగుతూ 2007లో 32 మరణాలకు చేరగా ఆ తర్వాతి మూడేళ్లలో వరుసగా 111,116,128 మరణాలకు ఒక్కసారిగా పెరిగాయని కేంద్ర ఆరోగ్యశాఖ అంగీకరించింది.

ప్రభుత్వం అమలు చేస్తున్న సార్వజనీన టీకాల కార్యక్రమానికి అవసరమైన టీకా మందులలో 70 శాతాన్ని ప్రభుత్వ సంస్థలైన మూడు టీకా తయారీ సంస్థలు అందజేసేవి. హిమాచల్ ప్రదేశ్‌లోని కౌశాలి, తమిళనాడులోని కూనూరు, చెన్నైల్లో యివి వుండేవి. మిగిలిన 30 శాతాన్ని ప్రైవేటు కంపెనీలు అందజేసేవి. ఈ మూడు ప్రభుత్వ రంగ సంస్థలూ "సురక్షిత వైద్య ప్రమాణాలు" పాటించటం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాఖ్యానించింది. ఈ సురక్షిత వైద్య ప్రమాణాలన్నవి టీకాల నాణ్యతకు సంబంధించినవి కావు. సిబ్బంది సంఖ్య, అక్కడ వాడుతున్న ఏసి మిషన్లకు సంబంధించినవి. ఇక్కడ తయారైన టీకాల నాణ్యత బాగున్నదనికూడా పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను అమలు చేయటానికి తగినన్ని నిధులందజేయమని ఈ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వాన్నికోరినా పట్టనట్టు ఊరుకున్నది. మూడేళ్ళ తర్వాత 2007లో పై కారణాలు సాకుగా చూపి పై మూడు సంస్థలనూ మూసివేస్తూ ఆజ్ఞలు జారీ చేసింది. ప్రైవేటు కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకే ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నదన్నది స్పష్టం. ప్రభుత్వ సంస్థల మూసివేత, మరణాల పెరుగుదల ఒకే సమయంలో (కోయిన్సిడెన్స్) జరిగాయి తప్ప రెంటికి సంబంధం లేదని ప్రభుత్వం బుకాయిస్తున్నది. పిచ్చికుక్కకాటుకు వాడే టీకా కూడా ఈ ప్రభుత్వ రంగ సంస్థలు తయారు చేసేవి. ప్రైవేటు కంపెనీలు యాంటీరేబీస్ టీకా ధరను విపరీతంగా పెంచి వేయటంతో, దానిని కొని నిల్వవుంచలేని స్థితి రాష్ట్రాలకు ఏర్పడింది. దీనితో ఈ మరణాలు పెరిగాయి.

సార్వజనీన టీకా కార్యక్రమంలో డిఫ్తీరియా, కోరింతదగ్గు, టెటనస్, పోలియో, క్షయ వ్యాధుల నివారణకు టీకాలను వేయటం ఇన్నాళ్లూ సాగుతూ వచ్చింది. ఈ ఆరు టీకాలకు కలిపి అయ్యే ఖర్చు 30 రూ॥లు. వీటిలో డిఫ్తీరియా, కోరింతదగ్గు, టెటనస్‌ల టీకాను డిటిపి అంటారు. ఇంజెక్షను రూపంలో ఇస్తారు. ఇప్పుడు వీటికి మరో రెండు టీకాలను చేర్చటానికి ప్రభుత్వం సిద్ధపడింది. అవి పచ్చకామెర్లు (హైపటైటిస్–బి) రక్తస్రావ ఇన్‌ఫ్లూయాంజా–బి, ఈ ఐదు కలిపి ఒకే ఇంజక్షనుగా యిస్తారట. దీని ఖరీదు 525 రూ॥లు. పచ్చకామెర్ల వ్యాధి జాతీయ ఆరోగ్య సమస్యగాలేదు. ఈ రెండు టీకాలపై పూర్తిస్థాయి శాస్త్రీయ పరిశోధనలు జరగలేదు. పచ్చకామెర్ల టీకాను భారత కంపెనీ శాంతాబయోటెక్ తయారు చేసేది. ఈ టీకా నాసిరకందని పెద్దయెత్తున ప్రచారం చేశారు. దీనితో శాంతా బయోటిక్ కంపెనీ లొంగిపోయింది. శనొఫి అవాంటిస్ అన్న బహుళజాతి కంపెనీ దీనిని కొని వేసింది. ఇప్పుడు ఐదు టీకాల ఇంజక్షన్‌ను తయారు చేసేది ఈ కంపెనీయే. ఇప్పుడు టీకా నాణ్యత గురించి ఎవరూ మాట్లాడరు.

ఇంత ఖరీదైన టీకాను ప్రభుత్వం ఎందుకు ఎంపిక చేసింది? భారత రాజకీయ నేతలందరూ సాగిలపడి నమస్కారాలు చేసిన బిల్‌గేట్స్‌గారి కృపాకటాక్షంతో ఈ ఎంపిక జరిగింది. గ్లోబల్ అలయన్స్ ఫర్ వాక్సినేషన్ అండ్ ఇమ్యూనైజేషన్ (గావి) అన్న "స్వచ్ఛంద" సంస్థను ఈయన పెట్టాడు. పేద దేశాలలో టీకాలు వేసి వ్యాధి నివారణ చేయటం దీని లక్ష్యమట. ఈ ఐదు టీకాల వాక్సిన్‌ను ఉపయోగించేందుకు 'గావి' సంస్థ 1.65 కోట్ల డాలర్లు భారత ప్రభుత్వానికిస్తుంది. దీనితో ఈ టీకాకు 145 రూ॥ మాత్రమే భారత ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆ సహాయం అయిపోయిన తర్వాత 525 రూ॥కు కొంటుంది. 1.65 కోట్ల డాలర్లు బిల్‌గేట్స్ ఉదారంగా ఇచ్చాడా? (తరువాయి 2వ పేజీలో)

# కామ్రేడ్ తోలెం నర్సయ్య (కొండన్న)కు జోహార్లు

కామ్రేడ్ తోలెం నర్సయ్య (కొండన్న) 19-5-2011న గుండాల మండలం సాయనపల్లిలో అనారోగ్యంతో మరణించారు.

కా॥ కొండన్న 1968లో విప్లవ కమ్యూనిస్టు కమిటి నాయకత్వాన విప్లవోద్యమ కార్యకర్తగా చేరాడు. చారుమజుందార్ వ్యక్తిగత హింసావాద రాజకీయాలకు భిన్నమైన రాజకీయోద్యమంలో నిలబడ్డాడు. దళ సభ్యుడిగా, దళనాయకుడిగా, కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ప్రజల తలలో నాల్కలా కృషి చేస్తూ వచ్చాడు. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి కామ్రేడ్ కొండన్నకు జోహార్లర్పిస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేస్తున్నది.

## రైతాంగ... (మొదటి పేజీ తరువాయి)

సమగ్ర గణాంకాలు లేవు గానీ వేల ఎకరాల అటవీ, ప్రభుత్వ భూములను ప్లాంటేషన్ల పెంపకం పేరిట వీటికప్పగించిన సందర్భాలు మాత్రం వార్తలుగా అందరికీ తెలిసినవే. ప్రస్తుతం దీనికంటే తీవ్ర సమస్య నూతన సాంకేతిక పేరుతో వీటి చొరబాటు. ఒక్క బిటి విత్తనాల రంగంలోనే ఏటా 1500 కోట్ల రూ॥లు రైతాంగం చెల్లిస్తున్నారంటే ఈ చొరబాటు దోపిడీ స్థాయి ఏ మేరకు వుందో తెలుస్తుంది. ఈ చొరబాటు వ్యవసాయ పంటల నుండి వాణిజ్య పంటలకు రైతాంగాన్ని మళ్లిస్తున్నది. ఆ విధంగా వీటికి అవసరమైన ఉత్పాదకాల (ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు) రేట్లు పెంచటంతోనూ వ్యవసాయ మార్కెట్టుపై గుత్తాధిపత్యంతోనూ అడకత్తెరలో పోక చెక్కలా రైతాంగాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారు.

ఈ మొత్తం సంక్షోభమంతా చివరకు రైతాంగం రుణగ్రస్తతగా వ్యక్తమౌతున్నది. దేశం మొత్తంగా అయితే 60 శాతం ఆంధ్రప్రదేశ్‌లో 82 శాతం రైతాంగం అప్పుల వూబిలో కూరుకు పోయారు. దీని సామాజిక దుష్ఫలితం, రైతాంగం ఆత్మహత్యలు. రైతాంగ అప్పుల రద్దు, రుణపరపతి పెంపు, పావలావడ్డీ అంటూ తీసుకున్న చర్యలన్నీ కంటితుడుపు చర్యలే. వీటన్నింటి తర్వాత కూడా రైతాంగానికందిస్తున్న సంస్థాగత రుణాలు 50శాతం మించటం లేదనీ, సహకార సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని డి. బంధోపాధ్యాయ తేగేసి చెప్పాడు. ఇదికాక ఎరువుల వంటి ఉత్పాదకాల వ్యాపారులే రుణ దాతలుగా తయారైన ప్రమాదకర ధోరణి కూడా నానాటికీ పెరిగిపోతున్నదని హెచ్చరించాడు. అంటే పేద, మధ్య తరగతి రైతాంగం సాగుఖర్చుల కొరకు ప్రైవేటు వ్యాపారుల చేతిలో బందీలై పోతున్నారు.

ఈ క్రమాన్ని త్వరితం చేసేందుకే రైతాంగానికి సీజను వారిగా ఒక్కొక్క సమస్యనూ పాలకులు తీవ్రం చేస్తున్నారు. పంట రైతు చేతికి వచ్చే సరికి కనీస మద్దతు ధర గరిష్ట అమ్మకం ధరగా తయారై కూర్చుంటుంది. తొలకరి వానలు పడి సాగుపనులు మొదలు కాగానే విత్తనాలు కనుమరుగవుతాయి. ఎరువుల కొరత ఏర్పడుతుంది. వీటి గరిష్ట చిల్లరధర మూడింతలవుతుంది. సాగుపనులు సాగుతుండగా సాగునీటి కొరత పుట్టుకొస్తుంది. నీరెప్పుడొదులుతారో తెలియక బిందెలతో చేను తడుపుకునే దుస్థితిలోకి నెడతారు. మొదట చెప్పినట్లు ఈ సీజను వారీ కల్పిత సమస్యలకు ముందుగానే సిద్ధం చేసిన కల్పిత నినాదాలతో పాలక వర్గ పార్టీలు సిద్ధమౌతాయి. ఈ మొత్తంనాటకీయ పరిణామాలన్నీ అభివృద్ధి దాడి అసలు లక్ష్యాన్ని దాచిపెట్టడానికే సాగుతున్నాయి. అదే కాంట్రాక్టు/కార్పోరేటు సాగు.

ప్రభుత్వమూ, దానికి వత్తాసు పలికే ఆర్థిక వేత్తలూ కాంట్రాక్టుసాగు ప్రయోజనాల గురించి వూదరగొడుతున్నారు. కర్ణాటకలో పూల రైతులు యూరపుకెగుమతి చేసి గడిస్తున్న లాభాలను ఆదర్శంగా చూపుతున్నారు. పంజాబు రైతాంగం కాంట్రాక్టుసాగు నుండి పొందిన లబ్ది గురించి ఎడతెగకుండా మాట్లాడుతున్నారు. రాష్ట్రం తర్వాత రాష్ట్రం దీనినే ఆహ్వానిస్తున్నాయి. కుప్పంలాంటి ప్రయోగాలకు పూనుకుంటున్నాయి. అచిరకాలంలోనే వీటి బండారం బయటపడినా - పెప్సికంపెనీతో ఒప్పందం చేసుకుని బంగాళాదుంపలు పండించిన రైతులు వాటిని రోడ్లపై పారబోసిన స్థితి, కుప్పం ప్రయోగం రైతుల సాగు భూమిని బీడుగా చేసి ఎల్లలు తెలియకుండా చేసిన వైనం-పాలకులు మాత్రం కాంట్రాక్టుసాగుకే వత్తాసు పలుకుతున్నారు.

ఈ కాంట్రాక్టు సాగు భారత రైతాంగానికి కొత్తదేమీ కాదు. 19వ శతాబ్దంలో ఈస్టుయిండియా కంపెనీ రుద్దిన నీలిమందు సాగుతో ప్రారంభమై, ఇంపీరియల్ టొబాకో కంపెనీ పొగాకు సాగుతోనూ, చక్కెర మిల్లుల చెరకు పంట సాగులోనూ నేటివరకూ సాగుతున్నదే. నీలిమందు సాగు ఎంత తీవ్ర దుష్పరిణామాలకు దారి తీసిందంటే దానికి వ్యతిరేకంగా రైతాంగం అనేకసార్లు తిరుగుబాట్లు చేశారు. ఐటిసి కంపెనీ పొగాకు రైతులను కీలుబొమ్మలను చేసి ఆడించింది. రైతాంగం తిరగబడి పోరాడి టొబాకో బోర్డు ఏర్పడేవరకూ అది చెప్పిందే రేటు; అదికూడా ఇచ్చినప్పుడే పుచ్చుకోవటంగా సాగింది. ఇక చెరకు రైతులు మిల్లుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడక తప్పని పరిస్థితి నేటికీ కొనసాగుతున్నది. ఆ పోరాటాల వత్తిడికి తలఒగ్గి ప్రభుత్వం తీసుకున్న రక్షణ చర్యలను కూడా మిల్లులు ఈ నాటికీ వమ్ము చేస్తున్నాయి. ఇప్పుడు ఆయిల్‌పామ్ రైతుల వంతు వచ్చింది.

ఈ దుర్మార్గ దోపిడీ విధానానికే నయా ఉదారవాద ఆర్థిక సిద్ధాంతాల ముసుగువేసి కాంట్రాక్టు / కార్పోరేటు సాగుగా తిరిగి ప్రవేశ పెడుతున్నారు. మొత్తం వ్యవస్యారంగాన్ని పుంజీడు బహుళజాతి కంపెనీల ఆధీనంచేసి రైతాంగాన్ని బంధిత ఉత్పత్తిదారులుగా, తమ భూములలో తమనే పాలేర్లుగా మార్చేందుకు సామ్రాజ్య వాదులుతో చేతులు కలిపి భారత పాలకవర్గాలు, వారి రాజకీయ ప్రతినిధులు సాగుతున్నారు.

ఇది విధ్వంసకర పరిణామాలకు దారి తీస్తుంది. రైతాంగాన్ని దుర్భర దారిద్ర్యంలోకి నెట్టివేస్తుంది; భూముల నుండి గెంటివేస్తుంది. దేశ ప్రజల అవసరాలు తీర్చటమన్న లక్ష్యంతో పంటల సాగు ఉండదు. కంపెనీకి లాభాలు వచ్చే పంటలసాగు మాత్రమే వుంటుంది. ప్రజలకు ఆహారం, బట్టకూడా కరవవుతుంది.

ఈ క్రమం యిప్పటికే ప్రారంభమైంది. రైతాంగం మొత్తంగా పేదరికంలోకి దిగజారి పోతున్నారు. కేంద్ర ప్రభుత్వపు నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం రైతాంగంలో పేదరికం 1982లో 66.64 శాతం వుండగా, 2003లో అది 79 శాతాన్ని దాటింది. ప్రపంచీకరణ రోడ్డురోలరు రైతాంగాన్ని దిమ్మెస కొడుతున్నది. గిట్టుబాటు ధర లేకపోవటం, విత్తనాలు-ఎరువుల కొరత, సాగునీటి అలభ్యత, రైతాంగ రుణగ్రస్తత, రైతాంగ ఆత్మహత్యలు- ఇవన్నీ రోగలక్షణాలే. అసలు వ్యాధి ప్రపంచీకరణలో భాగంగా రుద్దుతున్న కాంట్రాక్టు సాగు. ఈ వ్యాధిని నివారించే, నయంచేసే లక్ష్యం భారత పాలకులకులేదు. రోగ లక్షణాలను నెమ్మదించే చర్యలతో రోగాన్ని పెంచి వ్యాధిగ్రస్తుణ్ని మరణానికి సన్నద్ధం చేసేందుకే వారు పూనుకున్నారు.

మరి ఈ వ్యాధికి ఔషధం లేదా? రోగ లక్షణాలు నెమ్మదించే పాలకుల చర్యలను తిరస్కరించి దున్నే వానికే భూమి ప్రాతిపదికన విప్లవ భూసంస్కరణలను అమలుచేయాలి. సాగుభూమికి నీటిపారుదలా సౌకర్యం కల్పించాలి. ప్రజల అవసరాలు తీర్చటం లక్ష్యంగా స్వావలంబిత వ్యవసాయ విధానం రూపొందించాలి. పంటల జీవవైవిధ్యాన్ని తరతరాలుగా పెంపొందించుకుంటూ వస్తున్న రైతాంగ విజ్ఞానాన్ని క్రోడీకరించి నిలకడైన సాగుపద్ధతులను రూపొందించాలి. ఇది ఈ దోపిడీ పాలకులు చేయరు. దృష్టిమళ్లించే నినాదాలతో వారు ముందుకొస్తున్నారు. పాలకుల ఈ మోసాన్ని గ్రహించి రైతాంగం తమ తక్షణ సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతూనే, తమ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్న దోపిడీ పాలకవర్గ విధానాలను తిరస్కరించి వ్యవసాయ విప్లవోద్యమ నిర్మాణానికి సంఘటిత పడాలి.

D

# కౌలురైతులను మరోసారి వంచించిన ఆర్డినెన్స్

**కౌలు రైతులను** ఆదుకుంటానని, వారికి బ్యాంకుల నుండి రుణాలు యిప్పించేందుకు రుణ పరపతి ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టామని, రైతు మిత్ర గ్రూపులను ఏర్పాటు చేశామని ప్రభుత్వం చెప్పినా కౌలు రైతులకు రుణాలు అందలేదు. ఇప్పుడు కౌలు లైసెన్సు ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఇంత హడావుడిగా ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను ఎందుకు తీసుకొచ్చింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా కౌలు రైతులకు రుణాలు అందుతాయా?

కౌలుదారి రైతాంగం సేద్యంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రంలో వీరి సంఖ్య 26 లక్షల వరకు ఉంది. వీరిసేద్యం మాత్రం సమస్యలమయంగా మారింది. తినితినక ఇంటిల్లిపాది కష్టపడి కూడబెట్టిన కొద్దిపాటి డబ్బుకి తోడు అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని ఎకరా రెండెకరాల భూమి కౌలుకి తీసుకుంటున్నారు. సరళీకృత ఆర్థిక విధానాలతో పాటు, వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న యాంత్రీకరణ, కాంట్రాక్టుకూలి విధానంతో సేద్యపు పనులు కుదించుకుపోయి, ఉపాధి అవకాశాలు తరిగిపోయి. కూలిపనులు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో కౌలుసేద్యం ద్వారా ఉపాధి లభిస్తుందనే ఆశతో ఈ సేద్యాన్ని ఆశ్రయిస్తున్నారు.

కౌలు రైతాంగం ఎక్కువగా ఉండటం, వారికి కావాల్సిన భూమి తక్కువగా ఉండటంతో పోటీ ఏర్పడి కౌలు రేట్లు పెరుగుతూ వస్తున్నాయి. దీనికి తోడు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలను ప్రభుత్వం పెంచి వేయటంతో వాటి ధరలు విపరీతంగా పెరుగు తున్నాయి. వీటన్నిటి ఫలితంగా కౌలు రైతాంగానికి ఎకరాకి 36 వేల దాకా సేద్యపు ఖర్చులు అవుతున్నాయి. పత్తి, మిర్చి, చెరకు లాంటి వాణిజ్య పంటలకు లక్షదాకా ఖర్చుపెట్టవలసి వస్తున్నది. కౌలుదారులుగా ఎటువంటి ఆధారం భూ కామాందులు ఇవ్వకపోవటం, ఆధారం లేకుండా అప్పులు ఇవ్వటానికి బ్యాంకులు నిరాకరించటంతో సేద్యపు ఖర్చులు సమకూర్చుకోవటం గగనమైపోయి వడ్డీవ్యాపారులను ఆశ్రయించక తప్పటం లేదు.

ఇన్ని ఇబ్బందుల మధ్య సేద్యం చేస్తున్న కౌలు రైతులకు అబధ్రతపట్టిపీడిస్తున్నది. పంట చేతికి వచ్చే దాకా ఏ ఉపద్రవం వచ్చిపడుతుందోనానే భయం పట్టి పీడిస్తున్నది. ప్రతి సంవత్సరం వరదలు, తుఫానులు, చీడపీడలు, క్షామ పరిస్థితుల వలన పంటలకు అపార నష్టం జరుగుతూ ఉండటమే ఇందుకు కారణం. దీనికి తోడు పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక పోవటం వలన రైతాంగం నష్టపోవాల్సివస్తున్నది. ఒకసారి వీటి వలన నష్టపోతే సేద్యంలో నిలబడటం సాధ్యంకాదు. చేసిన అప్పులకు ఉన్న గొడ్డుగోదా, ఇల్లు కూడా అమ్ముకొని రోడ్డున పడక తప్పని పరిస్థితి. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలను కోల్పోయినవారికి ప్రభుత్వం అందించే ఎటువంటి సహాయం అందదు. బ్యాంకులులాగానే వారికి ఆధారం లేదనే సాకుతో ప్రభుత్వం మొండి చేతులు చూపటం కౌలురైతుల ఎడల ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తున్నది.

ఇలాంటి దారుణమైన పరిస్థితుల్లో సర్వం కోల్పోయినా, అప్పులు తీరక, వడ్డీవ్యాపారుల వేధింపుల భరించలేక, నలుగురిలో అవమానం పాలౌతామనే భయంతో ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. రైతులు చేసుకొంటున్న, ఆత్మహత్యల్లో కౌలు రైతులే ఎక్కువగా ఉండటం ఇందుకు నిదర్శనం.

ఇలాంటి దారుణ పరిస్థితుల్లో ఉన్న కౌలు రైతాంగానికి కౌలుధారీ చట్టాన్ని వర్తింప చేసి, కౌలు దారులుగా గుర్తించాలని బ్యాంక్ రుణాలతోపాటు ప్రభుత్వం అందించే సహాయం ఇవ్వాలని రైతుకూలీ సంఘాలు, రైతాంగం ప్రయోజనాలను ఆశించేవారు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేయటం, ఆందోళనలు ప్రారంభించటంతో కౌలుదారులను ఆదుకొంటామని చెబుతూ సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తూ వచ్చింది. ప్రభుత్వం వైఖరిపై తీవ్రవిమర్శలు వెల్లు వెత్తటంతో బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తా మని, అందుకు బ్యాంకులను ఒప్పించామని, కౌలురైతులు బ్యాంకుల నుండి అప్పులు తీసుకోవచ్చని రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం మాటలు నమ్మి రైతాంగం బ్యాంకులకు వెళితే వారికి చేదు అనుభవం ఎదురయ్యింది. కౌలు పత్రాలు లేకుండా అప్పులు ఇవ్వమని బ్యాంక్ అధికారులు ఖరాఖండిగా చెప్పారు. ప్రభుత్వం యొక్క ఈ మోసపూరిత విధానం ఎడల రైతులు తీవ్ర ఆగ్రహం చెందారు. వీరికి ప్రభుత్వం ఎడల తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. దీన్ని గమనించిన ప్రభుత్వం వారి అసంతృప్తిని చల్లార్చే విధంగా జాయింట్ లయబిలిటి (జె.ఎల్.జి.) గ్రూపుల ఏర్పాటు, నలుగురు నుండి పదిమందిదాకా ఒక్కో గ్రూపులో రైతులను చేర్చింది. ఈ గ్రూపులకు రుణాలు అందజేస్తామని చెప్పింది. ఇవి డ్వాక్రా మహిళల, సూక్ష్మ ఫైనాన్స్ గ్రూపులలాంటివే. గ్రూపుల్లో చేరేవారు ముందుగా శేరుధనం చెల్లించాలి. ఇలా చెల్లించేదే బ్యాంక్‌లో పెద్దమొత్తంలో డిపాజిట్ అవుతుంది. దీనికి తోడు బ్యాంక్‌లు కొంత జేర్చి ఈ గ్రూపులకు అప్పుయిస్తుంది. అంటే రైతుల డబ్బునే రైతులకు అప్పుగా ఇస్తుంది. ఈ గ్రూపుల్లో ఉన్న వారిలో ఎవరైనా అప్పు చెల్లించకపోతే సభ్యులందరూ అందుకు బాధ్యతవహించి అప్పుతీర్చాలి. ఈ గ్రూపుల ద్వారా

(తరువాయి 5వ పేజీలో)

## టీకాల... (మొదటి పేజీ తరువాయి)

ఈ టీకాను తయారు చేస్తున్న శనోఫి అవాంతిస్ (శాంతాబయోటెక్ యజమాని)కు గేట్స్ ఫౌండేషన్‌లో 12 కోట్ల డాలర్ల వాటాలున్నాయి. అలాగే ఈ టీకా తయారు చేసే మరో కంపెనీ సంసధపెర్క్‌కు కూడా గేట్స్ ఫౌండేషన్‌లో వాటాలున్నాయి. టీకాలకోసం తయారు చేసే కంపెనీలన్నీ కలిసి సహాయం పేరిట తమ టీకాలను మన దేశంపై రుద్దుతున్నాయి. టీకాల రంగంలో ప్రపంచంలో గుత్తాధిపత్యస్థాపనకు సాధనమే ఔదార్యం రూపం దాల్చింది. భారత పాలకులు దీనికే తోడ్పడుతున్నారు.

అదనంగా చేర్చిన రెండు టీకాలూ ఎంత వరకూ పని చేస్తాయన్న సందేహాలలా వుంచినా, వీటిని విడివిడిగా ఇస్తే వాటికయ్యే ఖర్చు ఒక్కొక్కదానికి 10 రూ॥లు (ప్రభుత్వరంగ సంస్థలతో తయారు చేయిస్తే) మొత్తం 50 రూ॥లయ్యే దానికి ప్రస్తుతం 145 రూ॥లు చెల్లించటానికి సిద్ధపడి (కొన్నేళ్ళ తర్వాత 525 రూ॥) సామ్రాజ్యవాద ఔదార్యాన్ని పొగడుతున్న భారత పాలకుల బానిస బుద్ధికి దళారీ అన్న కితాబు తప్పమరేమివ్వగలం!?

ఈ దళారీ పాలకులు మరో కలికితురాయి కూడా పొదువుకున్నారు. సూపర్ లాభాలార్జించే ఈ టీకాల తయారీకి కూడా భారత ప్రజలను ప్రయోగశాల జంతువులను చేశారు. మహిళల్లో గర్భసంచి ముఖద్వారానికి వచ్చే కాన్సరు వ్యాధి నివారణకు టీకాను తయారు చేసానని చెప్పుకున్న ఒక విదేశీ కంపెనీకి దానిని మహిళలపై ప్రయోగించి పరిశీలించేందుకు ప్రభుత్వం అనుమతి నిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం వద్ద గిరిజన యువతులపై దీనిని ప్రయోగించగా ముగ్గురు యువతులు మరణించారు. టీకా మందు వల్ల మరణం సంభవించలేదని కంపెనీ, ప్రభుత్వం బుకాయించాయి. విమర్శలు రావటంతో ప్రభుత్వం కమిటీని నియమించింది. ఔషధ ప్రయోగాలలో పాటించవలసిన అన్నిరకాల నిబంధనలను ఉల్లంఘించారని కమిటీ చెప్పింది గానీ దానికి బాధ్యులెవరో తేల్చలేదు. ఈ నివేదిక తన శాఖకు అందినప్పటికీ, దాని సారాంశం పత్రికల్లో వచ్చినప్పటికీ (10-5-2011 ది హిందు) కేంద్ర మంత్రి గులాం నబీ అజాద్ దీనితో ప్రభుత్వానికి సంబంధంలేదని పార్లమెంటుకు చెప్పాడు. వాస్తవమేమిటంటే దీనిని ఆంధ్ర ప్రదేశ్, గుజరాత్‌లలో గిరిజన యువతులపై అమలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) ఈ కార్యక్రమానికి అన్ని విధాల సహకరించమని, ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను ఒప్పించమనీ హాస్టలు వార్డెన్లు, హెడ్‌మాస్టర్లకు ఆజ్ఞలు జారీచేసింది. (డక్కన్‌క్రానికల్, 9-5-2011) ఇంతకీ ఈ కార్యక్రమానికి "సహాయ" మిచ్చిందెవరు? మళ్లీ గేట్స్ మిలిండా ఫౌండేషనే.

భారత ప్రజల ఆరోగ్యరక్షణను సామ్రాజ్యవాద బలిపీఠంపై వుంచిన వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు కుక్కల లెక్కల చిక్కుముడుల జిత్తుల మారితనాన్ని ప్రదర్శించటం తప్ప సిగ్గుమాలిన దళారీ పాలకులు చేసేదేమీ లేదు.

D

# పొదుపు చర్యలను నిరసిస్తూ వివిధ దేశాల కార్మికుల పోరాటాలు

## గ్రీస్

ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంకు నిర్దేశిత పొదుపు చర్యలను అమలుచేస్తున్న గ్రీసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ సెక్షన్ల కార్మికులు నిరాంతరాయ ఆందోళనను సాగిస్తున్నారు. ఆర్థిక సంక్షోభానికి కారకులైన పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం ప్రకటిస్తున్న ఉద్దీపన పథకాలు ప్రజలపై భారాల్ని పెంచుతున్నాయని, ధరలు పెరిగిపోతున్నాయని ఆందోళనకారులు పేర్కొంటున్నారు. కార్మికుల నిరసనాందోళనలతో గ్రీస్ అట్టుడుకుతున్నట్లుగా వుంది.

2011 ఫిబ్రవరి ఒకటవ తేదీన ఏథెన్స్ నగరంలోని రవాణా కార్మికులు పథకం ప్రకారం అమలు చేస్తున్న పబ్లిక్ రంగ సంస్కరణలను; ప్రభుత్వ రంగంలోని రవాణా కంపెనీలను పునర్వ్యవస్థీకరించాలనే ప్రతిపాదనలను నిరసిస్తూ సమ్మె చేశారు. బస్సు, ట్రాలీల కార్మికులు, మోటారు కార్మికులు, విద్యుత్, రైల్వే విభాగ కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనటం ద్వారా ప్రజారవాణా వ్యవస్థ స్థంభించింది.

ఫిబ్రవరి 2వ తేదీన ఆసుపత్రి వైద్యులు సమ్మె చేశారు. ఆరోగ్యమంత్రిత్వ శాఖ కార్యాలయంవద్ద పెద్ద సంఖ్యలో బైఠాయించి వైద్య రంగంలో ప్రభుత్వం విధించే కోతలను నిరసించారు.

ఫిబ్రవరి 4న గ్రీసు దేశంలోని అతిపెద్దదైన సామాజిక సంస్థ ఐకెయులోని 7 వేల మంది డాక్టర్లు నాలుగు రోజుల సమ్మె చేశారు. జాతీయ ఆరోగ్య వ్యవస్థను అస్తవ్యస్తం చేయటాన్ని వీరు వ్యతిరేకించారు.

ఫిబ్రవరి 15న గ్రీసు రాజధానీ నగరంలో రవాణా కార్మికులు ఒక రోజు సమ్మె నిర్వహించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే రవాణా సంస్థలను ప్రైవేటీకరించేందుకు ఉద్దేశించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టబోవటాన్ని వారు నిరసించారు.

ఫిబ్రవరి 27న దేశ వ్యాపితంగా 72 పట్టణాల్లో, నగరాల్లో సాధారణ సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెలో దాదాపు అన్ని పరిశ్రమల, వ్యాపార వాణిజ్య సముదాయాల, ఆసుపత్రుల, నౌకాశ్రయాల కార్మికులు, సిబ్బందీ పాల్గొన్నారు. యువకులు, మహిళలు పాల్గొన్న ఈ సమ్మె సందర్భంగా పోలీసులు పలుచోట్ల ఆందోళనకారులపై భాష్పవాయువును ప్రయోగించారు.

ఏప్రిల్ 7వ తేదీ నుండి జర్నలిస్టులు నాలుగు రోజుల సమ్మె చేపట్టారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రభుత్వం చేపట్టిన పొదుపు చర్యలను నిరసిస్తూ వీరు జాతీయ పార్లమెంటుకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

మే 11వ తేదీన దేశవ్యాపిత కార్మికులు ఒక రోజు సాధారణ సమ్మె చేశారు. పొదుపు చర్యల పేరిట ప్రభుత్వం-కార్మికులు, పేదప్రజానీకంపై సాగిస్తున్న దాడులను ఈ సమ్మెలో పాల్గొన్న కార్మికులు. యువకులు తీవ్రంగా నిరసించారు.

## బ్రిటన్

ప్రభుత్వం చేపట్టి, అమలుచేస్తున్న పొదుపు చర్యలకు నిరసనగా బ్రిటన్ ప్రజానీకం ఆగ్రహంతో రగిలిపోతున్నారు. జనవరి 31వ తేదీన లండన్, మాంఛెస్టర్, బ్రమింగ్‌హోమ్‌లతో సహా దేశంలోని అన్ని పట్టణాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బ్రమింగ్‌హోమ్‌లో పెద్దసంఖ్యలో కార్మికులతో పాటు, విద్యార్థి యువకులు, మహిళలు కూడా పాల్గొన్నారు.

ఫిబ్రవరి 27వ తేదీన లండన్ నగరంలో ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశ వ్యాపితంగా హాజరైన 2 లక్షల మంది ప్రజానీకంతో ఒక పెద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.

మార్చి 26వ తేదీన బడ్జెట్‌లోని ప్రజా పద్దులలో కోత విధింపును నిరసిస్తూ ఒక పెద్ద నిరసన ప్రదర్శనను లండన్ నగరంలో నిర్వహించారు. బ్రిటన్ దేశవ్యాపితంగా మూడు లక్షలమంది ప్రజానీకం ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. నల్లజాతి, తెల్లజాతి, ఆసియా దేశాల ప్రజలకు సంబంధించిన అన్ని తరాలవారు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. యువకులు, టీనేజర్లు, విద్యార్థులు, యువకార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## సైప్రస్

జనవరి 28వ తేదీన పదుల వేల సంఖ్యలో టర్కిష్ సైప్రస్ వాసులు సైప్రస్ లోని విభాజితమైన ఉత్తర భాగంలో ప్రభుత్వ ఆర్థిక విధానాలను, ప్రభుత్వరంగంలో వేతనాలకోతను నిరసిస్తూ నిరసన ధర్నాను నిర్వహించారు.

ఏప్రిల్ 7వ తేదీన 5 వేల మంది టర్కిష్ సైప్రెస్ వాసులు పొదుపు చర్యలను నిరసిస్తూ పార్లమెంట్ ఎదుట బైఠాయించి నిరసనను తీవ్రంచేశారు.

## హంగేరి

ఏప్రిల్ 9వ తేదీన 40 వేల మంది కార్మికులు బుడాపెస్ట్‌లో పొదుపు చర్యలకు వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన సందర్భంగా తమకు ఉద్యోగాలు కావాలని, తమకు సంక్షేమ రాజ్యం కావాలని, తాము బ్యాంకర్లకు జవాబుదారీ కాదని నినాదాలు చేశారు. ఇతర యూరోపియన్ దేశాల కార్మిక ప్రతినిధులు ఈ నిరసన కార్యక్రమంలో సంఘీభావంగా పాల్గొన్నారు.

## బెల్జియం

మార్చి 4వ తేదీన పొదుపు చర్యలకు వ్యతిరేకంగా, వేతన స్థిరీకరణకు వ్యతిరేకంగా నిరసనాందోళనను చేపట్టారు. దేశ వ్యాపితంగా ఎక్కువ నగరాల్లో పరిశ్రమలు మూతపడ్డాయి. బ్రస్సెల్స్ వెళ్ళే రహదారులన్నీ జనంతో కిటకిటలాడాయి.

## నెదర్లాండ్స్

జనవరి 21న వేలాది మంది విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు ఒక నిరసన ధర్నాను నిర్వహించారు. హాగ్యూలోని పార్లమెంట్ భవనం ఎదుట బైఠాయించి విద్యారంగానికి బడ్జెట్‌లో కోత విధింపును నిరసించారు. ప్రొఫెసర్లందరూ నల్లగౌనులు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. D

# సమస్యల పరిష్కారం కోసం ప్రపంచ దేశాల కార్మికుల ఆందోళనలు

## వియత్నాం

వియత్నాంలోని డానీ పట్టణంలో వున్న దక్షిణ కొరియాకు చెందిన బసావో దుస్తుల పరిశ్రమలోని 700 మంది కార్మికులు జనవరి 25 నుండి సమ్మెలోకి వెళ్ళారు. వీరంతా డిసెంబర్ నెల వేతన బకాయిలను చెల్లించాలని 'టెట్' సెలవుల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హనోయిస్‌లోని యమహా మోటారు పరిశ్రమకు చెందిన 300 మంది కార్మికులు ఫిబ్రవరి 9వ తేదీన సమ్మె చేశారు. నెలవారీ మూలవేతనం పెంపుదలకోసం ఇంటి అద్దె ఇతర సామాజిక భత్యాల పెంపుదలను వారు డిమాండ్ చేశారు.

## ఇటలీ

జనవరి 28వ తేదీన పదుల, వేల సంఖ్యలో కార్మికులు ఫియట్ పరిశ్రమలో అమలు చేస్తున్న నూతన పని నిబంధనలను నిరసిస్తూ దేశ వ్యాపితంగా ప్రదర్శనలు నిర్వహించారు. 10 వేలమంది కార్మికులు మిలాన్ కాథడ్రెల్ స్క్వేర్‌లో సమావేశమయ్యారు. ఆర్థిక సంక్షోభపు తాకిడికి గురైన ఇతర పరిశ్రమల కార్మికులు ఈ ప్రదర్శనలో పాల్గొని వారు పనిచేస్తున్న పరిశ్రమలను మూతబెట్టారు.

## వెనిజులా

వాలెన్సికోలోని కొకోకోలా ప్లాంట్‌లో పనిచేసే కార్మికులు జనవరి 14న సమ్మెచేపట్టారు వేతన పెంపుదలను, బోనస్‌ను వారు డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 14న తమ వేతనాలను పెంచేవరకూ ఆందోళనను కొనసాగించారు.

## స్పెయిన్

స్పెయిన్‌లోని 120 మిల్స్, ప్లాంట్లలకు చెందిన 17,500 మంది కార్మికులు మార్చి 3న ఒక రోజు సమ్మె నిర్వహించారు. యాజమాన్య వ్యతిరేక విధానాలను వారు నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు.

## కంబోడియా

ఫ్నోంపైన్‌లోని జూన్ జౌళి పరిశ్రమకు చెందిన 2 వేల మంది కార్మికులు ఫిబ్రవరి 23 నుండి సమ్మె నిర్వహించారు. కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, నిరంతరం వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు ఫ్యాక్టరీ ఉన్నతాధికారులను తొలగించాలని వారు డిమాండు చేశారు.

## ఇజ్రాయిల్

మార్చి 6వ తేదీన 10 వేలమంది సామాజిక కార్యకర్తలు ఇజ్రాయిల్ దేశ వ్యాపితంగా తమ వేతనాలను పెంచాలని, పని పరిస్థితులను మెరుగుచేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెచేశారు.

## చిలీ

మార్చి 11న చిలీలోని గనుల కార్మికులు దేశవ్యాపిత ఒకరోజు సమ్మె చేపట్టారు. గనుల ప్రైవేటీకరణను నిరసిస్తూ పనిపరిస్థితుల మెరుగుదలను వారు డిమాండ్ చేశారు. శాంటియాగోప్లాజా డీ ఆర్మ్స్ నుండి అధ్యక్షభవనం లా మోనెడా వరకు కార్మికులు ఒక ప్రదర్శన నిర్వహించారు.

## పోలాండ్

మార్చి 17వ తేదీన వార్సాలోని పోలిష్ పార్లమెంట్ భవనం సెజ్‌మ్‌లో సందర్శకుల గ్యాలరీలోకి నర్సుల బృందం చేరుకొని తమ వృత్తిలో క్యాజువల్ కార్మికులను పెంచివేయటాన్ని నిరసించారు.

## జెకొస్లావేకియా

మార్చినెలలో జెకొస్లావేకియా రాజధాని ప్రేగ్‌లోని వ్యవసాయ మంత్రిత్వశాఖ కార్యాలయాన్ని వలస కార్మికులు చుట్టుముట్టి ఆందోళన చేపట్టారు. దేశంలోని అటవీ ప్రాంతంలో వలస కార్మికులను బానిసలవలె చాకిరీ చేయించుకుంటూ దోపిడీ చేయటాన్ని వారు నిరసించారు.

## కైరో

ఏప్రిల్ 4వ తేదీన ఈజిప్షియన్ వ్యవసాయశాఖలో పనిచేస్తున్న 300 మంది కార్మికులు క్యాబినెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు తమ సర్వీసుల క్రమబద్ధీకరణను డిమాండ్ చేశారు. గత 15 సం॥లుగా వారు తాత్కాలిక కార్మికులుగా పనిచేస్తున్నారు.

## అమెరికా

బాలకార్మికులు శ్రమచేయటంపైనున్న ఆంక్షలను తొలగించాలని మిస్సోరి రాష్ట్ర సెనేటర్ జాన్ కన్నింగ్‌హోమ్ ఒక బిల్లును ప్రవేశపెట్టాడు. అతని ప్రతిపాదన బాలకార్మికుల చట్టాలను నీరుగార్చే విధంగానూ, 19వ శతాబ్దంనాటి పనిపరిస్థితులకు తిరిగి మళ్ళించేదిగానూ వుంది. మన దేశంనుండి దిగుమతయ్యే తివాచీలు, దుస్తులలో బాలకార్మికుల శ్రమవుందని గొంతుచించుకొని మాట్లాడే అమెరికా పాలకుల కపటత్వం దీనిద్వారా మరోమారు వెల్లడౌతున్నది.

## గ్రీస్

'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్' ఆధ్వర్యంలో 16వ ప్రపంచ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏథెన్స్‌లో ఏప్రిల్ 6 నుండి 10 వతేదీవరకు జరిగింది. మొత్తంగా 101 దేశాల నుండి 881 మంది ప్రతినిధులు, పరిశీలకులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణల ఫలితంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో కార్మికుల హక్కులపై సాగుతున్న దాడులను వారు చర్చించారు. 'వర్గపోరాట మార్గంలో ముందుకు సాగుదాం. ఒక వ్యక్తిని మరొక వ్యక్తి దోపిడీ చేయని, చేయలేని వ్యవస్థకోసం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిద్దాము'ని ఈ సమావేశాలు ప్రపంచవ్యాపితంగా కార్మికులకు పిలుపునిచ్చాయి. తానెప్పుడూ సామ్రాజ్యవాద దోపిడీకి, జాతి వివక్షా విధానానికి వ్యతిరేకంగా కార్మికులపక్షానే నిలిచానని డబ్ల్యు.ఎఫ్.టి.యు. ప్రకటించింది. D

# కార్మికుల హక్కులపై దాడులకు వ్యతిరేకంగా ప్రపంచదేశాల్లో నిరసన ఆందోళనలు

## ఐర్లాండు

ఫిబ్రవరి ఒకటవ తేదీన జాతీయ కనీస వేతనాన్ని గంటకు ఒక యూరోగా కోత విధించటాన్ని వ్యతిరేకిస్తూ పరిశ్రమ ప్రధాన ద్వారాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఐర్లాండులోని 3 లక్షల 50 వేలమంది అతితక్కువ వేతనాలు పొందే కార్మికులపై ఆ నిర్ణయంతీవ్ర దుష్ప్రభావంచూపుతున్నది.

## కొలంబియా

కొలంబియన్స్ నేషనల్ ట్రక్కర్స్ అసోసియేషన్‌కు చెందిన ఒక లక్షా 80 వేలమంది సభ్యులు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రపంచ బ్యాంకు రూపొందించిన స్వేచ్ఛా మార్కెట్ విధాన ప్రకారం ఓడనింపే కార్మికుల వేతనాలను మార్పు చేయటాన్ని ఈ కార్మికులు నిరసించారు.

## అమెరికా

2 లక్షల మంది ప్రభుత్వరంగసంస్థల కార్మికుల వేతనాలు, సౌకర్యాలలో కోత విధిస్తూ, యాజమాన్యంతో సామూహికంగా బేరసారాలాడే హక్కులను కాలరాస్తూ విస్కాన్‌సిన్ అసెంబ్లీ ఒక బిల్లును ఆమోదించింది. భవిష్యత్తులో వేతనాల కోతను నిరసించే ప్రతి ప్రయత్నాన్నీ తీవ్రంగా అణచివేసే స్వభావంతో ఈ బిల్లు రూపకల్పన చేయబడింది.

అసెంబ్లీలో ఈ బిల్లును ప్రతిపాదించిన నాటి నుండీ అది ఆమోదం పొందే వరకూ అంటే ఫిబ్రవరి చివరి వారం నుండి మార్చి 2వ వారం వరకూ మూడు వారాల పాటు ఎడతెగకుండా కార్మికులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ట్రెన్‌టన్, మాడిసన్‌లలో పదుల వేల సంఖ్యలో కార్మికులు, ఉపాధ్యాయులు, రవాణారంగ కార్మికులు ఇతర ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్న భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కార్మికుల ఈ ఆందోళనోద్యమాలకు ప్రపంచవ్యాపితంగా సంఘీభావం లభించింది. భారీ ప్రదర్శనల్లో పాల్గొన్న కార్మికులు విజయవతం తమదేననే విశ్వాసంతో ఉన్నారు.

## ఇజ్రాయిల్

ఇటీవల పెంచిన మరో విడత ధరల పెరుగుదలకు నిరసిస్తూ మార్చి ఒకటిన వందలాదిమంది హైఫాలోని కాంగ్రెస్ కేంద్రం ఎదుట బైఠాయించారు. అక్కడే సభ జరుపుకున్నారు.

## ఇటలీ

మార్చి 12న ప్రభుత్వరంగసంస్థల ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ షరతులపై దాడులను నిరసిస్తూ సమ్మె నిర్వహించారు. కార్మికులు దేశ రాజధాని రోమ్‌గుండా కవాతు వహించారు. ప్రైవేటు రంగంలో విడివిడిగా చర్చలు జరిపే చర్యలకు వ్యతిరేకంగా జాతీయస్థాయి ఒప్పందాలకు వీరు మద్దతుగా నిలిచారు.

## కొలంబియా

బొగోటా, బారాన్‌క్విల్లా, నౌలి, మెడెలిన్ మరియు కొలంబియాలోని ఇతర పట్టణాలలో వందల, వేల మంది కార్మికులు, విద్యార్థులు, విశ్రాంత కార్మికులు, ఉద్యోగులు, ఏప్రిల్ 6వ తేదీన ప్రదర్శన నిర్వహించారు. వీరంతా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించారు. కార్మికుల హక్కులను, ఉపాధ్యాయులకు ఇతర ఉద్యోగులకు మెరుగైన పని పరిస్థితులను, నిరుద్యోగాన్ని తగ్గించే చర్యలను, ట్రేడ్ యూనియన్ క్రియాశీల కార్యకర్తలకు పారామిలటరీ దళాల నుండి రక్షణను వారు డిమాండ్ చేశారు. D

## సిపిఐ (ఎం.ఎల్)లో చేరిక

సుదీర్ఘకాలంగా విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలలో పనిచేస్తూవున్న నేను గత కొంతకాలంగా సిపిఐ (ఎం-ఎల్)లో చేరి పని చేయాలని అనుకుంటున్నాను. సిపిఐ (ఎం-ఎల్)లో చేరాలన్న నా కోరికను సిపిఐ (ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములుగారికి తెలియపర్చాను. పార్టీ జిల్లా కమిటి ఆమోదించింది.

సిపిఐ (ఎం-ఎల్)లో చేరుతున్నానని, ఈనాటినుండి సిపిఐ(ఎం-ఎల్) సభ్యునిగా, కార్యకర్తగా కార్యకలాపాలు నిర్వహించగలనని పత్రికా ముఖంగా తెలియజేస్తూవున్నాను.

**గుంటూరు** **అభినందనలతో**
**31-5-2011** **రాగి సుబ్బారావు**

# దేశవ్యాపితంగా అభివృద్ధి-పారిశ్రామీకరణ పేరుతో భూములు-గనులు-అడవులు సర్వసంపదలను బహుళజాతి, బడాపరిశ్రమల పరం చేస్తున్న పాలకులు

**మనదేశం** వ్యవసాయాధారిత ఆర్ధిక వ్యవస్థగా-దేశంలో నూటికి 70 మందికి పైగా ప్రజానీకం వ్యవసాయంపైనా, దాని అనుబంధ రంగాలపైనా ఆధారపడి జీవనం సాగిస్తున్నారనే విషయం నిర్వివాదాంశం. గత ఆరు దశాబ్దాలపైగా భారత పాలకులు అనుసరిస్తూవస్తున్న సామ్రాజ్యవాద, బడా పెట్టుబడిదారీ, భూస్వామ్య అనుకూల విధానాల ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణప్రాంత ప్రజాజీవనం దుర్భరమౌతూవస్తున్నది. విస్తారమైన సాగుభూములు, అమూల్యమైన మానవవనరులు, అశేష జలసంపదల సమన్వయం-అనుసంధానం ద్వారా దేశంలోని అన్ని రంగాలలో స్వతంత్రంగా అభివృద్ధిని సాధించే విధంగా దేశ ప్రజలందరినీ భాగస్వాములను చేసే బదులుగా దోపిడీవర్గాల సేవలో పునీతులైన పాలకుల విధానాలతో దేశ ప్రజల జీవితాలు అధోగతి పాలవుతున్నాయి.

1990ల తర్వాత సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను వేగవంతం చేసిన పాలకులు-దేశంలోని సర్వసంపదలనూ బహుళజాతి, కార్పోరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు వరదగేట్లను తెరిచారు. భూ ఉపరితల, భూగర్భ, సముద్రగర్భ, ఖనిజ, అటవీ, సహజ సంపదలన్నీ మున్నెన్నటికంటే ఘోరంగా లూటీకి గురవుతున్నాయి. సాగుకు లాయకైన భూములకు తోడు మరిన్ని బీడు భూములను సాగులోకి తీసుకురావటం, సాగునీటి వనరుల సక్రమ వినియోగం వంటి విధానాల ద్వారా దేశంలో ఉత్పత్తిని పెంచటమేకాక, దేశంలోని ప్రతిఒక్కరికీ కనీస ఉపాధి గ్యారంటీ చేసే విధానాలను పాలకులు ఏనాడూ తలపెట్టలేదు. పెద్దఎత్తున భూములను-అదీ సాగుభూములను సన్న, చిన్న కారురైతుల నుండి బలప్రయోగంతోనో, భ్రమలకు గురిచేసో ప్రభుత్వమో, ప్రైవేటు సంస్థలో గుంజివేసుకునే ప్రక్రియ వేగంగా సాగిపోతున్నది. ఇదంతా-దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి దిశగా పరుగులు తీయించటానికి తాము చేపట్టిన సరికొత్త విధానాలుగా, దేశప్రగతికి ఇవన్నీ దోహదపడే అత్యవసరమైన చర్యలుగా పాలకులు ప్రజలను వంచిస్తున్నారు. ప్రజలు త్యాగాలు చేయాలని ఉద్భోదిస్తున్నారు. ఆధునిక విమానాశ్రయాలు, అతిపెద్ద నౌకాశ్రయాలు, ఎనిమిదిలైన్ల విశాల రహదారులు, ఆకాశవంతెనలు, ఆనకట్టలు, అణు, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, నీటి పారుదల పథకాలు; ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, వ్యవసాయార్థిక మండళ్ళు, గనుల తవ్వకాలు, నాలెడ్జి పార్కులు, పారిశ్రామిక పార్కులు, మోడల్ సిటీల వంటి వేయిన్నొక్క అవసరాల పేరిట ఇబ్బడిముబ్బడిగా భూముల కైంకర్యం సాగిపోతున్నది. ఇదంతా ప్రజల అభివృద్ధికోసమేనంటూ ఆ పేరిట ప్రజా జీవన విధ్వంసం సాగించుకుంటూపోతున్నారు. ఫలితంగా లక్షలాది మంది రైతులు, కూలీలు, గ్రామీణపేదలు పొట్ట చేతబట్టుకుని తమ గ్రామాలనుండి, భూముల నుండి నిర్వాసితులుగా తరిమి వేయబడుతున్నారు. అనాదిగా అడవినే నమ్ముకున్న ఆదివాసుల జీవనం, సంస్కృతి సర్వ విధ్వంసానికి గురిచేయబడుతున్నాయి.

వ్యవసాయమే గిట్టుబాటు గాకుండా చేసి రైతులు, కౌలురైతులు-తమభూములను వదలి పారిపోయేలా, ఆత్మహత్యలకు నెట్టబడే విధానాలను పాలకులు కొనసాగిస్తున్నారు-మరోవైపున సన్న, చిన్నకారు రైతుల నుండి పంట భూములను బలవంతంగా గుంజుకుంటూ, పంటలు పండే లక్షలాది హెక్టార్ల భూములను పడావు పెడుతున్నారు. ఈ విధానాల ఫలితంగా గ్రామీణ ప్రాంతం నుండి, అడవుల నుండి తరిమివేయబడి పట్నాలకు చేరే వలస కూలీల ప్రవాహం సాగుతున్నది. బానిస తరహాలో చాకిరీకి సిద్ధమై ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్ళే కల్లిబిల్లి కార్మికుల సంఖ్య పెరుగుతున్నది. పాలకులనుసరించే ఈ విధానాలన్నీ ప్రజాజీవన రంగాలన్నింటినీ ఒక్కటొక్కటిగా ధ్వంసంచేస్తూ, సమాజంలో తీవ్ర అశాంతికి, అలజడులకు కారణంగావున్నాయి.

పాలకులు చెపుతున్న అభివృద్ధి యొక్క వాస్తవరూపం ఇదికాగా ప్రగతి పథంలో దేశం ఉరుకులు పరుగులతో ముందుకు సాగుతున్నదనే అంకెల గారడీల ప్రచారంతో మసిబూసిమారేడుకాయ చేసిన చందాన ప్రజలను, మేధావులను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. పెద్ద ఎత్తున రానున్న విదేశీ పెట్టుబడులు, పరిశ్రమల కారణంగా ఉద్యోగావకాశాలు అనూహ్యంగా పెరుగుతాయనే భ్రమలు కల్పిస్తూ అరచేతిలో వైకుంఠం చూపుతున్నారు. వాస్తవానికి ఉన్న ఉపాధి అవకాశాలను కూడా ఊడగొట్టటమేగాక, ఈ ఆడంబర పదాల మాటున సంపదలనన్నీ దోచిపెట్టే దళారీ విధానాలను నిర్లజ్జగా కొనసాగిస్తున్నారు.

ప్రపంచంలోని వివిధ దేశాలలో సరైన వర్షపాతం, తగినన్ని నీటి వనరులు, సాగుకు యోగ్యమైన భూములు-ఒక్కమాటలో పంటలు పండేందుకు అనువైన వాతావరణ, పరిస్థితులు; సరిపడినన్ని మానవవనరులు లేని కారణంగానూ లేదా ఒకటి వుంటే మరో దాని కొరత కారణంగానూ ఆహార ధాన్యాలనూ, అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులనూ సక్రమంగా సాగించలేక పోతున్నాయి.

కాగా, మన దేశంలో వివిధ రకాల పంటలకు అనుకూలమైన విభిన్న వాతావరణ పరిస్థితులు, ప్రవహించే బంగారం వంటి జీవ నదులు, భూగర్భ నీటి వనరులు; అపారమైన శ్రమశక్తి వీటన్నింటిని సక్రమ వినియోగంలోకి తెస్తే మన దేశ జనాభాకు మించి రెండురెట్ల సంఖ్యకు సరిపోయే ఆహారధాన్యాలను ఉత్పత్తి చేయగలిగి వుండీకూడా నేటికీ నూటికి 77 మంది రోజుకు 20 రూ॥ కంటే దిగువ ఆదాయం కలిగివుంటూ కనీస ఆహారం కరవై పస్తులతో, అర్ధాకలితో జీవిస్తూండటంపట్ల మన పాలకులేమీ సిగ్గుపడటంలేదు.

కేంద్రంలో ఒకరి తర్వాత మరొకరుగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్, బిజెపి పార్టీలకూటములుకానీ, వివిధ రాష్ట్రాలలో అధికారంలో కొనసాగుతూ వున్న , ప్రతిపక్షంలో వున్న పార్టీలుగానీ-వామపక్షాల పాలనలో కానీ-తర, తమస్థాయి బేధాలతో ఇవే విధానాలను అమలు చేస్తున్నాయి. అయితే అధికారంలో వుండి ఈ విధానాలను అమలు చేసిన పక్షమే, ప్రతి పక్షంలో వున్నప్పుడు ఈ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లుగా పోజుపెడుతూ, ప్రజల అసంతృప్తిని సొమ్ము చేసుకునేందుకు, తద్వారా అధికార పీఠాన్ని కైవసం చేసుకొనేందుకు తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత తు.చ. తప్పకుండా అవే విధానాలను మరింత వేగంగా అమలు చేయటమనే విచిత్రాలను మనమిపుడెన్నో చూస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్‌లో లక్షల ఎకరాల భూసేకరణ చేసి దీనిని వ్యతిరేకించిన వారిపై పోలీసులను ఉసిగొల్పి ప్రజల ప్రాణాలను బలిగొన్న కాంగ్రెసుపార్టీ, దాని అధినాయకుడైన రాహుల్ గాంధీ-నవీన్‌పట్నాయక్ నాయకత్వంలోని బిజెడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒరిస్సాలో సాగుతున్న పోస్కో వ్యతిరేక ఆందోళనలో సైనికుడిలా నాయకత్వం వహించటానికి ముందుకొస్తాడు! ఉత్తరప్రదేశ్‌లో మాయావతి ఆధ్వర్యంలోని బి.యస్.పి. సాగిస్తున్న భూసేకరణకు వ్యతిరేకంగా జరుగు ఆందోళనలో నిషేదాజ్ఞలను ఉల్లంఘించి మరీ అరెస్టు అవుతాడు! కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్‌లలో భూములను భూబకాసురులకు కట్టబెట్టిన బిజెపి, ప్రతిపక్ష స్థానంలో నున్న రాష్ట్రాల్లో వ్యతిరేక ఆందోళనలు చేపడ్తున్నది. వ్యవసాయాన్ని దండగమారిదిగా వాఖ్యానించి, దిగజార్చిన చంద్రబాబు వ్యవసాయం పండుగలా మారుస్తామంటున్నాడు. భూ సేకరణలకు తన ప్రాణాలను అడ్డువేసి అడ్డుకొంటాననంటున్నాడు.

ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో పాలకపక్షాలు ఎవరైనప్పటికీ, జెండాలు వేరైనప్పటికీ-రైతులను, ఆదివాసులను భూములనుండి, అడవులనుండి గెంటివేసి లక్షలాది ఎకరాల భూములను బడా పరిశ్రమలకు, బహుళ జాతి పరిశ్రమలకు అప్పనంగా కట్టబెడుతున్న తీరునొకసారి పరిశీలిద్దాం:

## ఉత్తరప్రదేశ్

వ్యవసాయభూములను వ్యవసాయేతర అవసరాల పేరిట గుంజుకొంటున్న విధానాలకు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవలి కాలంలో ప్రజా ఆందోళనలు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నాయి. ఇక్కడ పాలన సాగిస్తున్న మాయావతి నాయకత్వంలోని బియస్‌పి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన పేరిట 8 లైన్ల రహదారులను (యమున ఎక్స్‌ప్రెస్ హైవే) నిర్మించ తలపెట్టింది. జె.పి. ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ నిర్మించే ఈ రహదారి ఫలితంగా వేలాది గ్రామాలలో ప్రజలు విస్థాపనకు గురవుతున్నారు. ఇది నిర్మించినందుకుగానూ 36 సంవత్సరాలపాటు టోల్ రుసుం వసూలు చేసుకొనేందుకు జె.పి. సంస్థకు ప్రభుత్వం అనుమతి నిచ్చింది.

2007లో ఈ ప్రాజెక్టు రూపకల్పననాటి నుండి ప్రజల నిరసనలు ప్రారంభమయ్యాయి. ఈ నిరసనలను పరిగణలోకి తీసుకోకపోగా ఈ యమునా ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానంగా హైటెక్ సిటీ (పారిశ్రామిక పార్కులు, గృహ, వాణిజ్య సముదాయాలు, మెగా షాపింగ్‌మాల్స్, కార్పోరేట్ విద్యా, వైద్యాలయాల) నిర్మాణం పేరిట, మాయావతి ప్రభుత్వం ఈ హైవేకు ఆనుకొని మరిన్ని భూముల సేకరణ చేపట్టింది.

దీనితో న్యూఢిల్లీ నుండి ఆగ్రావరకూ నిర్మించే 165 కిలోమీటర్ల యమునా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి, దీని అనుబంధ నిర్మాణాల పేరిట భూముల సేకరణకు వ్యతిరేకంగా ప్రజల ఆందోళన తీవ్రమైంది. భూములు కోల్పోవటం ఫలితంగా ఉపాధి కోల్పోయే రైతుకూలీలు, గ్రామీణ పేదలూ వీరికి అండగా నిలిచారు.

9500 కోట్ల అంచనా వ్యయంతో నిర్మితమౌతున్న ఈ ఎక్స్ ప్రెస్ హైవే ప్రాజెక్టుకోసం లక్ష ఎకరాల పైగా భూమి సేకరించారు. ఆరు జిల్లాల పరిధిలోని 1,191 గ్రామాలలోని దాదాపు 7 లక్షల ప్రజలు దీని ఫలితంగా నష్టపోతున్నారు. ఈ ప్రాంతంలోని భూములు రెండు పంటలు పండే సారవంతమైన భూములు మాత్రమే కాక రాష్ట్రంలోనే వరి, గోధుమ అధికంగా పండే ప్రాంతంకూడా కావడం విశేషం!

ఇక గ్రేటర్ నోయిడా నుండి బలియా వరకూ సాగే 'గంగా ఎక్స్‌ప్రెస్ హైవే' పేరిట 40వేల కోట్ల రూ॥ అంచనా వ్యయంతో 1,047 కి.మీ. దూరం నిర్మాణానికి; 5 వేల గ్రామాల గుండాసాగే 10 వేల హెక్టారుల భూమి సేకరణకు ప్రతిపాదనలు సిద్ధంగా వున్నాయి-దీనికింకా పర్యావరణ అనుమతులు పొందాల్సివుంది.

యమునా ప్రాజెక్టుకు సేకరించిన విధంగానే గంగా ప్రాజెక్టుకు అనుబంధంగా కూడా హైటెక్ సిటీ నిర్మాణం ప్రతిపాదన వుంది. మార్కెట్‌రేటు చ॥మీటరుకు 25,000 రూ॥ ఉండగా 1894 భూసేకరణ చట్టాన్ని ఉపయోగించి ప్రభుత్వం చ.మీటరుకు 880 రూ॥ మాత్రమే రైతులకు చెల్లించి ప్రజా ప్రయోజనాల పేరిట భూములను గుంజుకొంటున్నది.

సోనాభద్ర జిల్లాలో నిర్మించనున్న విద్యుత్ కేంద్రానికి; కుషినగర్‌లో నిర్మించనున్న బుద్ధ సర్క్యూట్ విమానాశ్రయానికి; జెపి కంపెనీనే మీర్జాపూర్‌లో నిర్మించనున్న సిమెంట్ పరిశ్రమలపేరిట సాగిస్తున్న భూ సేకరణలకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం వ్యక్తమౌతున్నది.

ప్రభుత్వమే మధ్య దళారీగా మారిపోయి, రైతులవద్ద నుండి 2500 ఎకరాలను మొత్తంగా 32 కోట్ల రూ॥కు కొనుగోలు చేసి తిరిగి వాటిని బడా కార్పోరేట్ సంస్థలకు 64 కోట్ల రూపాయలకు అమ్మివేసింది.

అలాగే నాసిక్-పూనేల మధ్య మరో థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణంకోసం 500 ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని వ్యతిరేకించిన ప్రజలపై పోలీసులు పెద్దఎత్తున లాఠీఛార్జీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలపట్ల క్రూరంగా వ్యవహరించిన ఒక పోలీసు ఇన్‌స్పెక్టరును ప్రజలు పట్టి బంధించారు. దీనితో పోలీసులు పెద్ద సంఖ్యలో రంగ ప్రవేశం చేసి ప్రతి ఇంటినీ గాలించి, ఆ ఇళ్ళలోని వారిని బయటకు లాగి విచక్షణా రహితంగా దాడిచేశారు. 200 మందిని అరెస్టు చేశారు. 125 మందిపై హత్యాయత్నం కేసులు బనాయించారు. షేత్కారి సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో ఈ ఆందోళన నిర్వహించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిలిపి వేయాలని ఢిల్లీ-బొంబాయి పారిశ్రామిక కారిడార్‌ను రద్దు చేయాలని, రైతులనుండి సేకరించిన భూములన్నీ తిరిగి రైతులకు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఛత్తీస్‌ఘఢ్

ప్రజల భూములను, అటవీ, ప్రభుత్వ భూములను లెక్కకు మించి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టటంలో ఛత్తీస్‌ఘఢ్ ప్రముఖంగా వుంది. జిందాల్ సంస్థకు బొగ్గుగనుల తవ్వకానికి, విద్యుత్ కర్మాగారాల నిర్మాణానికి, ఇనుప ఖనిజం తవ్వకాలు, ఉక్కు కర్మాగార నిర్మాణాల పేరిట ఈ భూముల సంతర్పణ సాగుతున్నది.

జిందాల్ థర్మల్ విద్యుత్ పరిశ్రమకు కావలసిన బొగ్గు కోసం బొగ్గుగనుల తవ్వకానికి భూములు సేకరించారు-ప్రజలలో నోరుగలవారిని ప్రలోభపరిచి, లేదా బెదిరించి ఈ ప్రక్రియ పూర్తిచేశారు. ఇప్పటికే జిందాల్ యాజమాన్యం రెండు ఓపెన్‌కాస్టు బొగ్గుగనుల తవ్వకాన్ని ప్రారంభించింది. ఇంకొన్ని బొగ్గుగనుల తవ్వకానికి సిద్ధంగావుంది.

ప్రపంచంలో పెద్దదైన స్పాంజి ఐరన్‌ను ఉత్పత్తి చేసే పరిశ్రమను జిందాల్ యాజమాన్యం రాయఘడ్‌లో ఇప్పటికే నిర్మించింది. రాయఘడ్ జిల్లా, రాష్ట్రంలోనే 70 శాతం సాగుభూములు కలిగి వుండగా, అత్యధిక ధాన్యం ఉత్పత్తి కేంద్రాలుగావున్న జాంజిఘడ్-చంపా జిల్లాలలో భూములను పెద్దఎత్తున సేకరించి బొగ్గుగనుల తవ్వకాలు సాగిస్తున్నారు.

ధర్మజయఘడ్ జిల్లాలో దైనిక్ భాస్కర్ పత్రిక (డిబి గ్రూపు) యాజమాన్యం 1320 మెగావాట్ల సామర్ధ్యంతో విద్యుత్ కర్మాగార నిర్మాణం కోసం 350 ఎకరాల భూములను సేకరించింది. ఈ విద్యుత్ కేంద్రానికి ప్రతి సంవత్సరం 20 లక్షల టన్నులపైగా బొగ్గు నిల్వలు అవసరమౌతాయి.

ఇక, వేదాంత గ్రూపుకు చెందిన స్టెరిలైట్ బాల్కో 1,070 హెక్టార్ల భూములను గుంజివేసుకొంది. ఛత్తీస్‌ఘడ్‌లోని తన పారిశ్రామిక విద్యుత్ అవసరాలకోసం కోర్బాబ్లాక్‌లో థర్మల్‌విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని చేపట్టింది.

జష్‌పూర్ జిల్లా ఉత్తరప్రాంతం రాష్ట్రంలో గనుల తవ్వకాలకు కేంద్రంగా వుంది. ఇక్కడ బాక్సైట్, బంగారం, వజ్రాలు, ఇనుప ఖనిజ నిక్షేపాలు అపారంగా వున్నాయి. ఈ ప్రాంతంలో 80 శాతం ఆదివాసులు జీవనం సాగిస్తున్నారు. 'జమీన్ బచావో సంఘర్ష సమితి' ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో గనుల తవ్వకాలకు వ్యతిరేకంగానూ; ఆ పేరిట ఆడవులను స్వాహా చేస్తూ ఆదివాసులను తరిమివేయటానికి వ్యతిరేకంగానూ ఆందోళన సాగుతున్నది. రాష్ట్రంలో విస్తాపనకు గురయ్యే వారిలో ఎక్కువ మంది వలస వచ్చిన బంగ్లా జాతీయులు మరియు గోండు, ఒరయాన్ తెగలకు చెందిన ఆదివాసులే. ఈ జిల్లాలో జరిగే ఆందోళనలలో ప్రజలు వేలాదిగా పాల్గొంటున్నారు. ప్రజా వ్యతిరేకత తీవ్రంగా వున్నచోట వివిధ కుట్రపూరిత పద్ధతుల్లో ఆందోళనను నీరుగార్చి, తమ కార్యకలాపాలను ముందుకు కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

'భూమికి భూమి' అనే విధానమే ఇక్కడలేదు. బాధిత ప్రజల చేతిలో నాలుగు డబ్బులు-అదీ కొద్ది రోజులు కనిపించటం మినహా వారి జీవనమే గగన మౌతున్నది. పైగా ఈ ప్రాంతంలో భూములు సేకరించి గనుల తవ్వకాలు సాగించే పరిశ్రమల యజమానులు స్థానిక కూలీలను కాకుండా బీహార్, ఝార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాల నుండి కాంట్రాక్టు కూలీలను రప్పించి, అతితక్కువ వేతనాలతో పని చేయించుకుంటున్నారు. స్థానికులకు ఉపాధి లేకపోవటం-ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ కూలీలు పని చేయటంతో ప్రజల మధ్య విబేధాలు పెరగటానికి ఇది కారణమవుతున్నది.

ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం థర్మల్ విద్యుదుత్పత్తి, సిమెంటు, స్పాంజి ఇనుము ఉత్పత్తిలో అగ్రగామిగా వుంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక ప్రకారం భారతదేశంలో ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్‌లో 27 శాతం మరియు సిమెంట్‌లో 51 శాతం; 31 మిలియన్ టన్నుల స్పాంజ్ ఇనుము ఉత్పత్తికి ఛత్తీస్‌ఘడ్ పథకాలను రూపొందించి అమలుచేస్తున్నది.

2008లో జాతీయ ఖనిజ విధానం ప్రకారం గనుల రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం కల్పించటంతో ఈ సమస్య మరింత తీవ్రమైంది. ప్రస్తుతం 1.64 లక్షల హెక్టార్ల అటవీ భూములను గనుల తవ్వకాలకు కేటాయించారు. జాంజిఘడ్-చంపాలో 111 ప్రాజెక్టులలో, ప్రస్తుతం 14 ఉత్పత్తి సాగిస్తున్నాయి. రాయఘడ్ జిల్లాలో అనుమతి పొందిన 297 పథకాలలో 51 ఉత్పత్తి సాగిస్తున్నాయి. జోష్‌పూర్‌లో 112 ఒప్పంద అవగాహనలు (ఎం.ఓ.యులు) జరిగాయి. ఇప్పటికి రాష్ట్ర వ్యాపితంగా ఉత్పత్తవుతున్న 10,300 మెగావాట్ల విద్యుత్తును 56,000 మెగా వాట్లుగా పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నది. అలాగే సున్నపురాయి నిక్షేపాలను పెద్ద ఎత్తున వెలికితీయటం ద్వారా మరో వంద మెట్రిక్ టన్నుల సిమెంట్ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపడ్తున్నది.

1999-2007 కాలంలో ఛత్తీస్‌ఘడ్‌లో పారిశ్రామిక అవసరాల పేరిట 82,300 ఎకరాల అటవీ భూములను (మొత్తం ఆ రాష్ట్ర అడవిలో 41.3 శాతం) బడాకార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టింది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక ప్రకారం దేశంలోనే అత్యధికంగా ఈ రాష్ట్రంలో వివిధ కంపెనీలు 745 ఒప్పంద అవగాహనలను కుదుర్చుకున్నాయి.

ఇంతాజేసి మొత్తం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ఆదాయంలో ఖనిజాల తవ్వకాలు, ఎగుమతులపై సెస్సులు, రాయల్టీల ద్వారా పొందే ఆదాయం 7.4 శాతం మాత్రమే! ఆదాయమూ రాకపోగా, మరోవైపున రాష్ట్రంలోని చిన్నస్థాయి, ఇనుము ఉక్కు కర్మాగారాలు, మధ్యతరహా పరిశ్రమలు మూసివేతకు గురై వేలాదిమంది కార్మికులు నడివీధిన పడుతున్నారు. **(తరువాయి 5వ పేజీలో)**

# భారతదేశంలో కార్మికుల ఆందోళనలు

## గుజరాత్

ఒరిస్సా, బీహార్, ఏ.పి, యు.పి., మహారాష్ట్రల నుండి వచ్చి గుజరాత్‌లోని పవర్‌లూమ్ పరిశ్రమల్లో పనిచేసే షుమారు 7 లక్షల మంది వలస కార్మికులు జనవరి 21 నుండి సమ్మె చేశారు. వారు నేసిన బట్టకు మీటరుకు 25పై మజూరి పెంచమని వారు డిమాండ్ చేశారు. వారి పనిపరిస్థితులు కడు హీనంగా ఉన్నాయి. వారు ఏదైనా తమ డిమాండును లేవనెత్తితే యాజమాన్యం వారిపై దాడిచేస్తుంది. హత్యలు సాగించేవరకూ వెళ్తుంది. పోలీసులు ఎల్లవేళలా యాజమాన్య పక్షమే వహిస్తారు. 4 లక్షల 50వేల మంది ఈ సమ్మెలో పాల్గొన్నారు. కార్మిక యూనియన్ నాయకత్వంతో జరిపిన చర్చలలో మీటరుకు 10 పైసలు పెంచేందుకు యాజమాన్యం అంగీకరించిందని ప్రకటించింది. ఈ కొద్దిపాటి పెంపుకు కార్మికులు అంగీకారంగా లేరు. కానీ ప్రభుత్వం పవర్ లూమ్స్ వద్ద పోలీసులను మోహరించి కార్మికులు ఏవిధమైన ఆటంకాలు కల్పించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

## తమిళనాడు

చెన్నైకి దగ్గరలోని ఒరగేడమ్ 'సెజ్'లోని సాన్‌మియాకు చెందిన యస్.సి.ఐ. ప్లాంట్‌లో పనిచేస్తున్న 1000 మంది కార్మికులు ఫిబ్రవరి 15వ తేదీన సమ్మె చేశారు. వారు వేతనాల పెంపును. ఆరోగ్యబీమాను, 8 గంటల పనిదినాన్ని, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణను, వారి యూనియన్ గుర్తింపును డిమాండ్ చేస్తున్నారు. సాన్‌మినా అమెరికాకు చెందిన గ్లోబల్ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ కంపెనీ అనుబంధ పరిశ్రమ. ఒరగేడమ్ ప్లాంటులో 1200 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

## పశ్చిమబెంగాల్

మార్చి 2వ వారంలో డార్జిలింగ్ జిల్లాలోని టీ తోటలలో పనిచేసే 30 వేలమందికి పైగా తాత్కాలిక కార్మికులు టీతోటల నుండి తేయాకు బయటకు పోకుండా అడ్డుకున్నారు. వారు వేతనాల పెంపుదలను డిమాండ్ చేస్తున్నారు. 'డన్‌లప్ ఇండియా' యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాల అమలులో క్రూరంగా వ్యవహరిస్తున్నది. ఏప్రిల్ 3న అది హటాత్తుగా పశ్చిమబెంగాల్‌లోని సహుగంజ్ పరిశ్రమను మూసివేసి ఏ విధమైన కారణాన్నీ కార్మికులకు చెప్పకుండానే లే-ఆఫ్‌చేస్తున్నట్లుగా నోటీసు బోర్డులో పేర్కొంది. 950 మంది కార్మికుల కుటుంబాలు దీనితో రోడ్డున పడ్డాయి. ఏమైనా, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 11న తిరిగి లే-ఆఫ్‌ను యాజమాన్యం ఉపసంహరించుకొంది.

## గుజరాత్

హలాల్‌వద్దనున్న జనరల్ మోటార్స్‌లో పనిచేసే 900 మంది కార్మికులు మార్చి 17 నుండి నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. పి.ఎఫ్. చట్టం, గ్రాట్యుటీచట్టం, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ హెల్త్ చట్టాలలోని అనేక నిబంధనలను యాజమాన్యం ఉల్లంఘించిందని కార్మికులు నిరసన తెలిపారు. పనిభారం పెంపుదలను కూడా వారు వ్యతిరేకిస్తున్నారు. ప్రతికార్మికుడిపై 30 శాతం భారం పెరిగింది. కాని యాజమాన్యం, ప్రభుత్వం ఈ సమ్మెను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాయి. రాష్ట్ర ప్రభుత్వం 144వ సెక్షనును విధించి కార్మికులు పరిశ్రమ సమీపంలో సమీకృతం కాకుండా నిరోధించింది.

## ఒరిస్సా

ఒరిస్సా రాష్ట్రం-బాలంగిర్ జిల్లా టిట్లాఘర్ వద్ద నున్న పౌమిక్స్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికుల సమస్యల పట్ల మొండివైఖరితో వ్యవహరిస్తూ వస్తున్నది. కొద్ది నెలల క్రితం ఏదో ఒక సాకుతో 14 మంది రెగ్యులర్ కార్మికులను, 45 మంది కాంట్రాక్టు కార్మికులను పనుల నుండి సస్పెండ్ చేసింది. దీనితో కార్మికులలో అసంతృప్తి రగులుకొంది. తొలగించబడిన కార్మికులు ఫ్యాక్టరీ గేటువద్ద కొద్దిరోజులుగా ప్రతిరోజూ ధర్నా నిర్వహిస్తూ వస్తున్నారు. కంపెనీలోని రెండు యూనియన్లు కార్మికుల వేతనాల పెంపుదల, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ డిమాండ్‌లపై ఆందోళన సాగిస్తున్నాయి. కార్మికులలో అశాంతి తీవ్రమౌతున్నా యాజమాన్యం లెక్కచేయకుండా మిన్నకుంది. ప్రభుత్వం త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేస్తే యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా దానికి హాజరుకాకుండా ప్రక్కన బడేసింది. కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికై తీవ్రమైన ఆందోళనకు గురైన ఆ పరిస్థితులలో మార్చి 3న ఫ్యాక్టరీ డిజిఎం కారును చుట్టుముట్టి దానిని తగులబెట్టటంతో డిజిఎం సజీవంగా తగలబడిపోయాడు. D

---

## దేశవ్యాపితంగా... (4వ పేజీ తరువాయి)

ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన నాణ్యమైన ఇనుపఖనిజం టన్ను రూ॥ 400 చొ॥న కారు చౌకగా జపాన్ దేశానికి ఎగుమతి చేస్తున్నారు. బడా కంపెనీలకు క్యాప్టివ్‌మైన్స్‌గా -టన్నుకు కేవలం 50 రూ॥ రాయల్టీ చెల్లింపుపై- ఆ రాష్ట్రంలోని బొగ్గు గనులకు అప్పగించేందుకు అవగాహన ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంటున్నది. కాగా, దేశీయ పరిశ్రమలు మాత్రం బహిరంగ మార్కెట్‌లో టన్ను రూ॥ 5,800 వెచ్చించి ఇనుపఖనిజాన్ని కొనుగోలు చేసుకుంటున్నాయి.

ఇప్పటికి ఛత్తీస్‌ఘడ్‌లో అనుమతి పొందిన పథకాలకు 65,000 హెక్టార్ల భూములు సేకరించారు. ఇంకా సంతకాలు చేసి, అమలులోకి రావలసిన పథకాల కోసం మరో 50 వేల హెక్టారుల భూములు అవసరమౌతాయని చెపుతున్నారు.

రాష్ట్రంలో 56 వేల మెగావాట్ల విద్యుత్ కావాలంటే 311 మిలియన్ టన్నుల బొగ్గు కావాలి-దీనితో 133 మిలియన్ టన్నుల ఫ్లైయాష్ ప్రతిసం॥ పేరుకుంటుంది. ఈ ప్రాజెక్టులన్నింటికీ 3వేల మిలియన్ క్యూబిక్ లీటర్ల నీరు అవసరమౌతుంది. అంటే ఛత్తీస్‌ఘడ్‌లోని జనాభాకు 13 రెట్ల జనాభాకు అవసరమైన నీటిని ఈ ప్రాజెక్టులు వాడుకుంటాయన్నమాట! ప్రభుత్వం ప్రకటిస్తున్న ప్రకారమే 1.71 లక్షల హెక్టారుల వ్యవసాయ భూములు పారిశ్రామిక అవసరాల పేరిట సేకరించారు. వీటిలో 67.2 శాతం గనుల తవ్వకాలకే కేటాయించారు.

### ఒరిస్సా

ఒరిస్సా రాష్ట్రంలో 2002-2010 మధ్య కాలంలో ప్రభుత్వం 8 లక్షల కోట్ల పెట్టుబడితో 184 పారిశ్రామిక ఒప్పందాలను చేసుకున్నది. వాటిలో 2 లక్షల 50 వేల కోట్ల పెట్టుబడితో 83 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో 50 స్టీలు పరిశ్రమలను; 37 వేల మెగావాట్ల విద్యుదుత్పాదన లక్ష్యంగా 30 థర్మల్ విద్యుత్ కేంద్రాలు; నాలుగు నౌకాశ్రయాలు; అల్యూమినా శుద్ధికర్మాగారాలు, సిమెంటు పరిశ్రమల నిర్మాణం ఉన్నాయి. ఇంకా 480 కి.మీ.ల ఒరిస్సా తీరంలోని 14 ప్రదేశాల్లో పోర్టుల అభివృద్ధి తదితర పథకాల పేరిట 50 వేల ఎకరాలపైగా భూముల సేకరణకు ప్రభుత్వం పూనుకుంది. ఇవికాక బాక్సైట్, ఇనుప ఖనిజం, బొగ్గు తవ్వకాలకు వేలాది ఎకరాల భూములను సిద్ధంచేస్తున్నది. అయితే ఇప్పటికీ ఆ రాష్ట్ర ప్రభుత్వం 15 వేల ఎకరాలు మాత్రమే సేకరించగలిగింది. ఒరిస్సాలోని నవీన్ పట్నాయక్ ప్రభుత్వం పోస్కో, వేదాంతవంటి బహుళజాతి కంపెనీలకు 331 చదరపు కిలోమీటర్ల అటవీ భూములను పారిశ్రామిక అవసరాల పేరిట కేటాయించటం ద్వారా ఆదివాసుల జీవించే హక్కులను కాలరాచివేస్తున్నది.

జగత్‌సింగ్‌పూర్‌లో జిల్లా థింకియా ప్రాంతంలో-దక్షిణకొరియాకు చెందిన బహుళజాతి పోస్కో సంస్థకు 12 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీలు పరిశ్రమ నిర్మాణానికి 4,000 ఎకరాల భూమిని కట్టబెట్టే ప్రభుత్వ ప్రయత్నాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల వ్యతిరేకతను నిర్బంధం ప్రయోగించి అణచివేస్తూ బడా కార్పొరేట్ సంస్థలతో ప్రభుత్వం అనేక అవగాహనా ఒప్పందాలను చేసుకొంటున్నది. రాష్ట్రంలోని ప్రతిపాదిత ప్రాజెక్టులలో ప్రస్తుతం అమలయ్యే పథకాల మూలంగానే లక్షలాది మంది ప్రజలు విస్తాపనకు గురై జీవనోపాధి కోల్పోతున్నారు. ఒక్క పోస్కో పరిధిలోనే 7 వేల మందికి ఉపాధి కల్పిస్తామంటున్నారు. కానీ ఆ ప్రాంతంలో కోల్పోతున్న భూముల ఫలితంగా 20వేల ఉపాధి అవకాశాలు తరిగిపోతున్నాయి.

2000 డిసెంబరులోనే రాయగడ జిల్లా కాశీపూర్ బ్లాక్‌లోని మాయికాంచ్ ప్రాంతంలో బలవంతపు భూసేకరణను అడ్డుకున్న గిరిజనులపై కాల్పులు జరిపి పోలీసులు ముగ్గుర్ని బలిగొన్నారు. 2006 జనవరి 2న జాజ్‌పూర్ జిల్లా-కళింగనగర్‌లో పోలీసు కాల్పుల్లో 13 మంది ఆదివాసీలు మరణించారు. ఆరు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో టాటా సంస్థకు కట్టబెట్టిన భూముల చుట్టూతా ప్రహరీ గోడ నిర్మించబూనుకోవటాన్ని వ్యతిరేకించినందుకే ఈ కాల్పులు సాగించారు.

కలహండిలోని లాంజిఘఢ్ - నియమగిరి కొండలలో వేదాంత అల్యూమినియం కంపెనీ బాక్సైట్ తవ్వకాలు సాగిస్తున్నది.

సుందరఘఢ్ జిల్లా-కాంథహార్ కొండల్లో ఇనుపఖనిజ తవ్వకాలకు పోస్కో సంస్థకు భూములను ప్రభుత్వం కేటాయించింది.

### ఝూర్ఖండ్

2000 సంవత్సరంలో ఈ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుండి అధికారంలో కొనసాగిన ప్రభుత్వాలు వివిధ బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ పరిశ్రమలతో అత్యధికంగా 133 అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీరిలో ఆర్సెలార్‌మిట్టల్, జిందాల్, టాటా వంటి బడా కార్పొరేట్ సంస్థలున్నాయి. ఈ మొత్తం పథకాలను అమలు చేసేందుకు 2 లక్షల ఎకరాలకుపైగా అవసరముందని పేర్కొన్నారు-దీనికనుగుణంగా వ్యవసాయ భూముల నుండి రైతులను, అడవులనుండి ఆదివాసులను తొలగించే ప్రక్రియ ప్రారంభమై కొనసాగుతున్నది. దీనితో పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ భూముల సేకరణను వ్యతిరేకిస్తూ ఆందోళనా మార్గంలో ఉన్నారు.

### మధ్యప్రదేశ్

బిజెపి అధికారంలో వున్న మధ్యప్రదేశ్‌లో 150 బడా కంపెనీలకు, సామ్రాజ్యవాద గుత్త సంస్థలకు కట్టబెట్టేందుకు 2 లక్షల 44 వేల హెక్టార్ల భూములను ప్రభుత్వం సేకరించింది. దీనిలో 1 లక్షా 94 వేల హెక్టార్ల భూమి రైతులు, ఇతర వర్గాలనుండి బలవంతంగా గుంజుకున్న ప్రైవేటు భూములే. కాగా దీనిలో 12 వేల 500 హెక్టార్ల అటవీ భూములు ఉన్నాయి.

దేశంలోని వివిధ ప్రాంతాలలో బహుళజాతి, బడా కార్పొరేట్ వర్గాలకు విచ్చలవిడిగా సాగుతున్న భూముల పందేరానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. మన రాష్ట్రంలో సాగుతున్న ఈ భూసమారాధన(చూడండి 5-6-2011 జనశక్తి) ఫలితంగా జరుగుతున్న ప్రజాజీవన విధ్వంసానికి ప్రత్యక్ష సాక్షులుగా వున్నాం. ప్రజాకవి సుబ్బారావు పాణిగ్రాహి చెప్పిన విధంగా 'దేశమంత ఘనసంపద- వీసమంత మాకందదు-ఆశపోతులంతజేరి దోచుకు పోతున్నారన్న'ది నూటికి నూరుపాళ్ళూ వాస్తవం. దేశంలోని సహజ సంపదలన్నీ దేశ ప్రజల ప్రయోజనాలకు, ప్రజాజీవన అభివృద్ధికి తోడ్పడుతున్నాయా లేదా అనే గీటురాయితో మాత్రమే నగిషీలు చెక్కిన పాలకుల విధానాలలోని విషస్వభావాన్ని, ప్రజావ్యతిరేక విధానాల నిజస్వరూపాన్ని గమనించి, వ్యతిరేకించి, పోరాడి ఓడిచటం సాధ్యమౌతుంది. **(వివరాలు : 2011 జూన్ 17 'ఫ్రంట్‌లైన్' ఆధారంగా)** D

---

## కౌలురైతులను... (2వ పేజీ తరువాయి)

కూడా కౌలు రైతులందరికీ రుణాలు అందలేదు. మొత్తం కౌలు రైతుల్లో 10 శాతం మందికే ఇలాంటి రుణాలు కూడా అందాయి. నలుగురు నుండి పదిమంది సభ్యులు ఉన్న గ్రూపులకు లక్షరూపాయలదాకా రుణాలు ఇవ్వాలని రిజర్వు బ్యాంక్ చెప్పినా బ్యాంక్‌లు దాన్ని అమలు పర్చటం లేదు. ఆచరణలో ఈ పథకం కూడా కౌలు రైతులకు రుణాలు యిప్పించలేక విఫలమైయింది.

గతసంవత్సరం వరదలు, భారీ వర్షాలకు పంటలకు అపార నష్టం జరిగి రైతాంగం ఎప్పుడూ లేని విధంగా నష్టపోయారు. ఇలా నష్టపోయిన రైతాంగానికి ప్రకటించిన నామమాత్రపు సహాయం కూడా కౌలు రైతాంగానికి అందకపోవటంతో ఆందోళనకు దిగారు. ప్రభుత్వం పై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ వైఫల్యం పూర్తిగా బట్టబయలైయింది.

ఈ విమర్శల నేపథ్యంలో వచ్చిందే కౌలు రైతులకు రుణ పరపతి ముసాయిదా బిల్లు. దీని ద్వారా కౌలు రైతులకు రుణ పరపతి కార్డులు అందచేస్తామని, ఆ కార్డుల ద్వారా బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవచ్చని ప్రభుత్వం ముసాయిదాలో పేర్కొంది. ఇది కూడా కౌలు రైతులను వంచించటానికే.

ఇప్పటికే రాష్ట్రంలో కౌలుదారీ చట్టం ఉంది. ఈ చట్టంలోని లోసుగుల వలన కౌలు విధానంలో చట్టం అమలు కాకుండా చేస్తున్నారు. ఈ చట్టం వలన కౌలు దారులకు కొన్ని హక్కులు ఏర్పడతాయి. కౌలుదారునిగా గుర్తింపు లభిస్తుంది. భూమి నుండి కనీసం ఆరు సంవత్సరాల పాటు కౌలుదారుణ్ణి తొలగించడానికి అవకాశం ఉండదు. బ్యాంకుల నుండి రుణాలు పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం యిచ్చే పరిహారాలు, సహాయం నేరుగా వీరికి అందుతుంది. ఈ చట్టం కొద్ది మంది కౌలు దారులకే వర్తించటంతో అత్యధిక మంది కౌలుదారులు చట్టానికి దూరంగా ఉండి మూజువాణి కౌలుదారులుగా ఎటువంటి హక్కులు లేకుండా ఉన్నారు. ఈ విషయం ప్రభుత్వానికి తెలుసు కౌలు దారులు ఎవరన్నది గుర్తించటం కష్టంకాదు. ఈ చట్టాన్ని కౌలు రైతులందరికీ వర్తించే విధంగా ఎందుకు చర్యలు తీసుకోవటంలేదు. చట్టాన్ని అమలు జరపటంలో ప్రభుత్వ విధానాన్ని గమనించినప్పుడు, చట్టాన్ని నిర్వీర్యం చేసి కౌలుదారులకు చట్టబద్ధమైన ఎటువంటి హక్కులు లేకుండా చేయటం ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధిగా కౌలుదారులకు రక్షణ కల్పించాలని ఉంటే కౌలుదారీ చట్టాన్ని వర్తింపచేసేది. ఆ చిత్త శుద్ధిలేని ఫలితంగానే రైతులను వంచించే విధానాలకు పూనుకొంటున్నది. అందులో భాగమే రుణపరపతి కార్డులు.

ముసాయిదాలో కౌలుదారులను గుర్తించి, భూయజమానులకు ఇష్టం ఉన్నాలేకపోయినా సర్వేనంబరుతో రుణపరపతి కార్డులు అందజేస్తామని చెప్పి రైతాంగం, కౌలు దారుల మధ్య తగవులు పెట్టింది. లేనివైరుధ్యాన్ని సృష్టించింది. రుణపరపతి కార్డుల వలన ప్రభుత్వం సహాయం కొంత మేరకు అందవచ్చేమో గాని బ్యాంకుల నుండి రుణాలు మాత్రం అందవు. హామీ లేకుండా అప్పులు ఇవ్వటానికి బ్యాంక్‌లు అంగీకరించకపోవటం అందుకు కారణం. ప్రతి సంవత్సరం కౌలు ఒప్పందం చేసుకోవాల్సిందే. కౌలు దారులు మారవచ్చు, భూమిపై కౌలు దారునికి ఎటువంటి హక్కు ఉండదు. దీనిపై రైతులు-కౌలుదారులు లేని సమావేశాలు జరిపి తుది ముసాయిదాను తయారు చేసింది. దీన్ని గత అసెంబ్లీలోనే ప్రవేశపెడతామని చెప్పి, అలా చేయకుండా కేంద్ర పరిశీలనకు పంపింది.

మార్చి-ఏప్రియల్‌లోపే రుణ పరపతి కార్డులు అందజేయటానికి చట్టాన్ని తేవలసి ఉండగా అందుకు చర్యలు తీసుకోలేదు. రుణపరపతి కార్డులు కూడా ఈ సంవత్సరం కౌలుదారులకు అందే పరిస్థితి లేకపోవటం, కార్డులను అందచేయటంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఎడల కౌలు రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న తరుణంలో 8-6-11న హడావుడిగా కౌలు రైతుల లైసెన్స్ ఆర్డినెన్స్‌ను విడుదల చేసి గవర్నర్‌చే ఆమోదముద్ర వేయించింది. దీని ద్వారా ఈ నెల 21 నుండి గ్రామ సభలు జరిపి కౌలు దారులను గుర్తిస్తామని, వారికి కార్డులు అందచేస్తామని ఆర్డినెన్స్‌లో పేరొన్నారు. ఈ కార్డుల ద్వారా కౌలు రైతులు బ్యాంక్ అప్పులు, పంట నష్టపరిహారాలు ఇన్‌ఫుట్ సబ్సిడీలాంటి సహాయం పొందవచ్చని పేర్కొంది. కార్డులు పొందటానికి బ్యాంక్ రుణాలు పొందటానికి భూయజమానులు అనుమతి తప్పనిసరి అని ఆర్డినెన్స్‌లో పేర్కొంది. ఇది ఆచరణలో అమలు జరగదు. ప్రభుత్వమే రైతుల్లో కొన్ని అనుమానాలు సృష్టించటం వలన కౌలుకి యిచ్చే ఏ రైతు, కౌలురైతులు అప్పులు తీసుకోవటానికి అంగీకారం తెలిపే పరిస్థితి ఉండదు. హామీ లేకుండా బ్యాంకులు అప్పులు ఇవ్వనంటున్నాయి. కాబట్టి ఈ ఆర్డినెన్స్ వలనకూడా కౌలు రైతులకు రుణాలు రావు.

కౌలుదారీచట్టాన్ని పూర్తిగా వర్తింపచేయటానికి ఇష్టపడని ప్రభుత్వం ముసాయిదాలు, ఆర్డినెన్స్‌లు తయారు చేయటం, అవి అమలు జరగకపోవటం కంటే, ప్రభుత్వమే హామీ ఉండి కౌలు రైతులకు బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించటానికి ఎందుకు చొరవ చూపటంలేదు. ప్రభుత్వానికి కౌలు రైతులపై నమ్మకం లేదా! దేశ ప్రజలకు అన్నంపెట్టే రైతులకు ప్రభుత్వం ఈ మాత్రం చేయూతను ఎందుకు ఇవ్వలేకపోతున్నది. ఇందులోను ప్రభుత్వానికి రాజకీయ ఉద్దేశం ఇమిడి ఉంది. కౌలు దారీ చట్టాన్ని అమలు జరపకుండా రుణ పరపతి ముసాయిదా బిల్లు, కౌలు లైసెన్స్ ఆర్డినెన్స్‌ల పేర రైతుల-కైలుదారుల మధ్య వైషమ్యాన్ని సృష్టించి, వారికి రుణాలు యిస్తామంటూనే ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, కౌలు దారులను సేద్యం నుండి తొలిగే పరిస్థితి కల్పించి, చిన్న, సన్నకారు రైతుల భూములను కాంట్రాక్టు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించటం ప్రభుత్వ ఉద్దేశం. మహిళల స్వయం సహాయ డ్వాక్రా గ్రూపులనేర్పరచి తర్వాత సూక్ష్మరుణ సంస్థల దోపిడీకి దారి వేసినట్లుగానే, కౌలు రైతులను సంయుక్త బాధ్యతా బృందాలు (జయింటు లయబిలిటీ గ్రూపు)గా ఏర్పాటు చేసి, ఇప్పటికీ ఐటిసి వంటి కంపెనీలు ప్రతిపాదిస్తున్న రైతు క్లబ్బుల వంటి కాంట్రాక్టు సాగుకు అవసరమయ్యే విధంగా రైతాంగ సంస్థల ఏర్పాటుకు దారివేసే ప్రయత్నంలో భాగంగానే ఈ ఆర్డినెన్సును చూడాలి.

కౌలు రైతులను ప్రభుత్వం వంచించే విధానాలను మానుకొని చట్టంలోకి రాని కౌలుదారులందరికీ కౌలుదారీ చట్టాన్ని వర్తింప చేయాలని, ప్రభుత్వమే హామీగా కౌలురైతులందరికీ పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు అందచేయాలని కౌలు రైతులు, రైతులు కలసి సమైక్యంగా ఉద్యమించాలి. D

# మనుగోపుల, కుంకాల ప్రాంత భూ పోరాటం-ఇటీవలి పరిణామాలు

**పశ్చిమగోదావరిజిల్లా** పోలవరం మండలంలోని జిళ్ళేళ్ళగూడెం పంచాయితీలోని కుంకాల, పేంద్రాల, జిళ్ళేళ్ళగూడెం, మనుగోపుల, రెడ్డినాగంపాలెం తదితర గ్రామాలలో భూస్వాములకు, మాజీ జమీందారులకు వ్యతిరేకంగా ఆదివాసులు అనేక సంవత్సరాలుగా ఆందోళనలు, భూ పోరాటాలు సాగిస్తున్నారు. మొత్తం పశ్చిమ గోదావరి ఏజన్సీలోని పోలవరం ప్రాంతంలో షుమారు రెండువేల ఎకరాల భూమి - ఆదివాసీ, ఆదివాసీయేతర పేద ప్రజల చేతుల్లోఉంది. మరోపక్క పోరాటం ప్రారంభమైన తర్వాత అధికారులు భూస్వాములకు సెటిల్‌మెంట్ ఆర్డర్లు అనే పట్టాలు ఇచ్చారు. భూములు ప్రజల చేతుల్లో, పట్టాలు భూస్వాముల చేతుల్లో ఉన్నాయి. 1969 నుండి కొండమొదలు ప్రాంతంలో సాగుతున్న భూ పోరాటాల ఉత్తేజంతో కదలుతూ, ఆటంకాలను దాటుతూ క్రమంగా 1989 నుండి పశ్చిమగోదావరి జిల్లాలో గిరిజన భూ పోరాటాలు తిరిగి భూ స్వాధీన ఉద్యమాలుగా ప్రారంభమయ్యాయి. భూ పోరాటాలు ప్రారంభమయ్యాకే రెవిన్యూ అధికారుల; పాలకపార్టీనాయకుల వత్తిడి, ప్రభుత్వ రాజకీయ జోక్యాలతో అప్పటివరకూ, 'తరం కట్టిన గయాళులు'గా (అసైన్డ్‌వేస్ట్ డ్రై-ఏ.డబ్ల్యు.డి) రెవిన్యూ రికార్డులలో వర్గీకరిస్తున్న భూములపై గిరిజనేతర భూస్వామ్య శక్తులకు అధికారులు సెటిల్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. దీనికి పశ్చిమగోదావరిజిల్లాలో నకిలీ హైకోర్టు ఆర్డర్లు, నకిలీ పాసుపుస్తకాలు, నకిలీ ఎం.అర్.ఓ. స్టాంపుల కుంభకోణం కారణమని తదనంతర కాలంలో బయట పడింది. దాదాపు 27 వేల ఎకరాల భూ కుంభకోణం జరిగిందని ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తూ సమగ్ర విచారణ జరపమని నేటికీ డిమాండ్ చేస్తున్నాయి. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే రాష్ట్ర హైకోర్టుకి ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్టులో పోలవరం, బుట్టాయగూడెం మండలాలలో 5 వేల హెక్టార్ల సాగుభూమి ఏ.డబ్ల్యు.డి. భూములుగా ఉన్నాయని, వాటన్నింటినీ గిరిజనులకే పంపకం చేస్తామని ప్రకటించింది. కానీ, నేటి వరకూ ఏ.డబ్లు.డి. భూములపై గిరిజనేతరులకి ఇచ్చిన అక్రమ సెటిల్‌మెంట్ ఆర్డర్లు రద్దు చేయలేదు.

జిళ్ళేళ్ళగూడెం పంచాయితీ అని ఇప్పుడు పిలుస్తున్న కుంకాల, పేంద్రాల, జిళ్ళేళ్ళగూడెం, మనుగోపుల గ్రామాల ప్రాంతంలో, ఇతర ప్రాంతాలన్నింట్లో కలిపి హుకుంపేట మాజీ జమీందారు హోతా కుటుంబంకింద 4,500 ఎకరాలు ఉండేది. ఏజన్సీ భూమి షుమారు 1500 ఎకరాల్లో కుంకాల, పేంద్రాల ప్రాంతంలో 300 ఎకరాల భూమివుంది. ఈ మొత్తం భూమిని అక్రమంగా కాజేసిన తీరుపై 1940ల నాటి మద్రాసు ఎస్టేట్ ఎబాలిషన్ కమిటి (ప్రకాశంకమిటి) రిపోర్టునుండి నేటివరకూ ఎన్నో సాక్ష్యాలున్నాయి. హోతాకుటుంబీకులు 1974 భూ సంస్కరణల ట్రిబ్యునల్ ముందు తమ భూములన్నీ వ్యవసాయ క్షేత్రాలుగా డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. అయితే 1/70 కానీ, 1/59 చట్టంగానీ, షెడ్యూలు ప్రాతంలోని ఏ స్థిరాస్థినీ బదిలీ చేయటం చట్టరీత్యా చెల్లదని, షెడ్యూలు ప్రాంతంలో గిరిజనేతరులు ఎవ్వరూ వ్యవసాయ క్షేత్రాలను కలిగి వుండరాదని స్పష్టంచేస్తున్నాయి. దీని ప్రకారం అయినా షెడ్యూల్ ప్రాంతంలో హోతాకుటుంబీకుల సెటిల్‌మెంట్ ఆర్డర్లను రద్దు చేయాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

చివరకి 2002 మార్చి 30న గిరిజన సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసరు, ఆర్డీవో, పోలీసు అధికారులు, జమీందారు కుటుంబ సభ్యులు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కా॥ ఝాన్సీ, కోటయ్య తదితర నాయకులు, వివిధ పార్టీలనాయకుల సమక్షంలో జిళ్ళేళ్ళగూడెం పంచాయితీ భూములు ఎవరివన్న దానిపైచర్చ జరిగింది. జమీందారు కుటుంబ సభ్యులు తమకున్నాయనుకున్న భూమికి పట్టాలు పొందిన క్రమాన్ని నిగ్గు తేల్చేందుకు పీ.ఓ. అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పరచటం, ఆ భూములన్నీ అంతవరకూ వివాదస్పద భూములుగా ప్రకటించడం జరిగింది. అయితే కమిటీ ఏర్పాటుకు అంగీకరిస్తూ ఒప్పందం మీద సంతకం చేసిన హోతా శ్రీరామ చంద్రమూర్తి తదితరులు సంతకం తడి ఆరకముందే ఆ కమిటీకి గ్రహణం పట్టించారు. ఆ కమిటీ ఏ పనీచేయకుండానే పీ.ఓ. బదిలీతో ముగిసిపోయింది ఈ విధంగా ఒక ప్రతిష్టంభనను భూస్వామ్య శక్తులు, ప్రభుత్వాధికారులు కల్పించి జమీందారుల అక్రమ పట్టాల బండారం బట్టబయలు కాకుండా అడ్డుకొంటూ వస్తున్నారు. అయితే ఆ భూములు వివాదస్పదమైనవని అధికారులు ప్రకటించారు. ఈ విధంగా భూములు జమీందారువే అని చెపుతున్న అధికారులు వెనక్కి తగ్గేలా చేయడం నాటి సమావేశం సాధించిన విజయం.

నిజానికి హోతావారి కుటుంబంకానీ, భూస్వామ్య శక్తులుగానీ పోలవరం ప్రాంతంలో ప్రాబల్యం వహించడానికి అనేక కారణాలున్నాయి. ఒకటి -భౌగోళికంగా ఏజన్సీ ప్రాంతంగా బయట వ్యక్తులు సులువుగా ప్రవేశించే వీలును, విశాలమైన లంక భూములను కలిగి వుంది. పశ్చిమగోదావరి జిల్లా 1930ల నాటికే వర్జీనియా పొగాకుకి అనువైనదని తేలడంతో పెద్దఎత్తున గిరిజనేతర భూ ఆక్రమణలు అప్పటి 1917 చట్టాన్ని ఉల్లంఘించి సాగాయి. సుదీర్ఘ క్రమంలో గిరిజనేతర భూస్వామ్య శక్తులతో నిరంతరం అంటకాగే గిరిజన పెత్తందారీ వర్గం అభివృద్ధి చెందింది. గిరిజన పెద్దల మధ్య సహజంగా ఉండే చిన్న విభేదాలను, పట్టింపులను భూస్వామ్య శక్తులు, పెత్తందార్లు బాగా ఉపయోగించుకొని గిరిజన సమాజం కోసం నిలచిన పెద్దలను అణచివుంచారు. తమకు తొత్తులుగా ఉండే వార్ని ప్రోత్సహిస్తూ వీరిని పంచాయితీ సర్పంచ్‌లు, యం.పి.టీ.సీ.లుగా ఎన్నిక చేస్తూ వచ్చారు. ఇలాంటి పెత్తందారీశక్తులు భూస్వాముల అండతో పంచాయితీ నిధులను, బ్యాంకు-సొసైటీల నిధులను, ఊరుమ్మడి నిధులను మింగుతూ వచ్చారు. వీరికి వ్యతిరేకంగా గిరిజన పేదలకోసం, గిరిజనులు కోల్పోయిన తమ చేలలోనే కూలీలుగా పాలేర్లుగా మారడం ఇష్టంలేని పెద్దలు గిరిజన ప్రజలకు నాయకత్వం వహించి గతంలో ఎన్నో పోరాటాలు చేశారు. అయితే సరైన మార్గదర్శకత్వం, నిర్మాణం లేనందున భూస్వాముల, గిరిజన పెత్తందార్ల కుమ్మక్కులతో వారి ప్రయత్నాలు విఫలం చేయబడుతూ వచ్చాయి. హోతా కుటుంబం అందరి భూస్వాములలాగనే తమ అనుచరులనే ప్రతి వాదులుగా పేర్కొంటూ కేసులు పెట్టే పద్ధతులను అనుసరించింది. ఆ అనుచరులు కోర్టులనుండివచ్చే సమన్లకు స్పందించకుండా, ఎవరికీ కనీసం తెలియపర్చకుండా వుంటారు. చివరకు ప్రతివాదులు కోర్టుకు రానందున ఎక్స్‌పార్టీడిక్రీలువస్తాయి. ఆ డిక్రీలతో భూ పోరాటాలను దెబ్బతీస్తూ గిరిజన పెద్దలను కేసులలో ఇరికించి వేధిస్తూవచ్చారు. ఇలా 1948 నుండి వేధింపులకు గురౌతున్న కొందరు గిరిజన పెద్దలు ముఖ్యంగా అమరులు కరకం రామయ్య, కొక్కెర చంద్రయ్య అనే కుంకాల గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివాసీ పెద్దలు కుంకాల నుండి కొండమొదలు నడిచివెళ్ళి అక్కడి గిరిజన సంఘపోరాట చైతన్యాన్ని గమనించి తమ ప్రాంతానికి సంఘం రావాలని ఆహ్వానించారు. ఆ విధంగా 1995 నాటికి కొండమొదలు నుండి ఉద్యమ విస్తరణలో భాగంగా పోలవరం వైపు సాగుతున్న ఉద్యమం-కుంకాల, పెంద్రాల ప్రాంతానికి వచ్చింది. అప్పటకే ఎల్.ఎన్.డి. పేట పంచాయితీగావున్నా, అది న్యూడెమోక్రసి నాయకత్వాన ఉంది. గిరిజన ప్రజల ఆహ్వానంతో కుంకాల, పెంద్రాల, మనుగోపులకు ఏజన్సీ గిరిజన సంఘం వచ్చే సమయానికి జిల్లా కలెక్టర్ రామకృష్ణ అప్పటి ప్రభుత్వ కార్యక్రమమైన 'తెలుగు మాగాణి సమారాధన'లో భాగంగా భూమి రికార్డులను ప్రజలకు చదివి వినిపించే కార్యక్రమం చేపట్టారు. గ్రామ సభలలో అధికారులు భూరికార్డులు చదువుతుంటే భూస్వాముల భూములనుకుంటున్నవన్నీ ఏ.డబ్ల్యు.డి. భూములని గిరిజన యువకులకు అర్థమైంది. ఆ భూములన్నీ తమకు పంచాలని వారు కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. ఈ పనిచేసినందుకు 1995 మార్చి 19,20 తేదీలలో రెండురోజుల పాటు జమీందారు, అతని అనుచరులు సాగించిన దుర్మార్గపు దాడులకు మనుగోపుల నుండి కుంకాలవరకూ ప్రజలు గురయ్యారు. ప్రజలని పట్టుకొని కొట్టారు. నాయకులుగా కనిపించిన యువకులను కొట్టి చిత్రహింసలు పెట్టి పొగాకు బ్యారెన్లలో వేసి సజీవంగా తగులబెట్టిపోయారు. ప్రజల ఆహార ధాన్యాలను, పచ్చళ్ళను తగులబెట్టటమో, కిరసనాయిలు పోసి పాడుజేయటమో చేశారు. తర్వాత క్రమంలో జిల్లాకలెక్టరును అవమానకరంగా బదిలీ చేశారు. ఈ స్థితిలో ఏజన్సీ గిరిజన సంఘం వేలమంది గిరిజనులతో పోలవరం మండల కార్యాలయాన్ని దిగ్బంధనం చేసి, హోతా శ్రీరామచంద్రమూర్తిని అరెస్టు చేయాలని నినదించింది. జమీందారు దురాక్రమణలోని భూములన్నీ గిరిజనులవేనని ప్రకటించి స్వాధీన పరుచుకుంది. ఫలితంగా జమీందారును అరెస్టు చేశారు. 1995 మార్చినుండి 1997 నవంబరు వరకు జమీందారు ఈ కక్షతో తన చెప్పుచేతల్లో ఉండే గిరిజన పెత్తందార్లనే ప్రతివాదులుగా పేర్కొని ఏలూరు శలవుల కోర్టులో ఇంజెంక్షన్ ఆర్డర్ సంపాదించాడు. ఈలోగా కొందరు ఈ పెద్దలు జమీందారుకి, తమకు ఎం.ఆర్.ఓ.గారి సమక్షంలో ఒప్పందం కుదిరిందనీ, మరల జమీందారుకే అప్పగించుతామని, దీనికి ప్రతిగా 1997 ఆగస్టు 15న జమిందారుగారు గిరిజనులందరికీ సంతర్పణ జరుపుతారని, జమీందారు భూములలో వ్యవసాయం చేసిన గిరిజనులకు వారు వేసిన పంటలను జమీందారు స్వాధీనం చేసుకున్నందున నష్టపరిహారం చెల్లించుతారని బయలుదేరారు. నాటి సర్పంచ్, ఇతర పెద్దలు ఈ ఒప్పందంపై సంతకం చేసి ఆగస్టు 14న ప్రకటించారు. ఈ ఒప్పందం బూటకమని గిరిజనసంఘం ప్రకటించింది. గిరిజనులెవరూ భూములు వదులుకోరాదని వివరించింది. దీనితో ప్రజలలో వచ్చిన కదలిక చూసిన అధికారులు ఆగస్టు 15 సంతర్పణను వాయిదా వేసుకొన్నారు. ఏజన్సీ గిరిజన సంఘం ఎల్.ఎన్.డి. పేట (లక్ష్మినారాయణ దేవుపేట) పంచాయితీలో ప్రవేశించ రాదని యం.ఆర్.ఓ. ప్రకటించాడు. నాటి పెద్దల బూటకపు ఒప్పందం ఆ విధంగా రద్దయింది. దీనితో కక్ష పెంచుకున్న జమీందారు తనుచేరదీసిన "పెద్దల" మద్దతుతో 1997 నవంబరు 4న కుంకాల, మనుగోపుల ప్రాంతానికి ఇంజెంక్షన్ ఆర్డర్‌తో ప్రవేశించాడు. అతన్ని మనుగోపుల ప్రజలు నిలవేశారు. రెవిన్యూ అధికారులు వచ్చి ఇక్కడ 1/70 చట్టం అమలవుతుందోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మూర్తీభవించిన అహంకారం, ప్రజలపట్ల చులకనభావం, తన అనుచరుల పట్ల ధీమాతో ప్రభుత్వ పోలీసు యంత్రాంగంపై పట్టుతో హోతా శ్రీరామచంద్రమూర్తి- తనను, అధికారులను నిలవేసి ప్రశ్నిస్తున్న గిరిజన మహిళలపై పోలీసు చేతిలో నుండి తుపాకి లాక్కొని కాల్పులు జరిపాడు. కారం పార్వతిని కాల్చి చంపాడు. అనేకమంది గాయపడ్డారు. అయినా పోరాటం కొనసాగింది. 1997 నుండి భూములు ఆదివాసీల స్వాధీనంలో, సాగులో ఉన్నాయి. ప్రజల జీవన ప్రమాణం పెరిగింది. ఈ క్రమంలో సాపేక్షంగా ప్రజలు స్వేచ్ఛను, ఆత్మవిశ్వాసాన్ని పొందారు.

నాటి నుంచి నేటి వరకు గిరిజనుల ఐక్యతను లోపల్నుంచి విచ్ఛిన్నం చేయాలని, గ్రామాలకి-గ్రామాలకీ, గ్రామాలలో ప్రజలకీ, మొత్తం గిరిజనులకీ-సంఘానికి మధ్యన చిచ్చుపెట్టాలని జమీందారు, ఆయన అనుచరులు ప్రయత్నిస్తూనే వస్తున్నారు. గిరిజన సంఘానికి పోటీగా ఏదోఒక ఎర్రజెండ పార్టీని నిలబెట్టాలని సిపియం, న్యూడెమోక్రసి నుంచి తుడుం దెబ్బవరకూ అనేక రకాల ముసుగులు ధరిస్తూనే ఉన్నారు. ప్రతీసంవత్సరం జనం దానిని తిప్పికొడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఎవరి గ్రామం వారిదే, ఎవరి సరిహద్దులు వారివేనంటూ 4-5 సం॥ల క్రితం ఈ పెద్దలు ఒక వాదన తెచ్చారు. గిరిజనులు భూపోరాటం నుంచి బయటకు వస్తే ఈ భూములను తామే చేసుకోవచ్చని కొందరు పెద్దలు ప్రలోభ పరిచారు. ఈ లోగా జమిందారు కూడా తన భూములను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకి పునరావాసం కోసం ఇస్తానని ప్రకటించి, నష్టపరిహారం తనకే ఇవ్వాలని అధికారుల వద్దకు వెళ్ళాడు. ఈ సమయాన్ని ఉపయోగించుకొని మొత్తం గ్రామాల నుండి కొందరు పెత్తందార్లు, కొత్త కుంకాల, పాతకుంకాల అనే గ్రామాలను విడదీసి మన గ్రామాలు మనవేనని చెప్పారు. ప్రశ్నించిన వారిని పోలీసులతో బెదిరించారు. క్రమంగా ఆ రెండు గ్రామాలలోని 30 ఎకరాల మామిడితోట ఫలసాయాన్ని ఇంకా అనేక ఎకరాల జీడిమామిడి, మామిడి తోటలను కలప పేర నరికించి అమ్ముకొన్నారు. ఈ విధంగా 3 సం॥లలో 18 లక్షలు సంపాదించారు. ప్రజలకు లెక్కలు చెప్పలేదు. చివరకు భూములన్నీ జమిందారువే కనుక నిర్వాసితులకు భూములు అప్పగించుదామని, దానికి ప్రతిగా 70 ఎకరాల బంజరు భూములు లాక్కొందామని ఒక ఒప్పందం తయారుచేసి ఆర్.డి.ఓ., తాసీల్దారుల ముందు ఒప్పందం జరిగి పోయిందని ప్రకటించారు. ఈ ఒప్పందాన్ని గిరిజన సంఘం వ్యతిరేకించడం దుర్మార్గమని న్యూడెమోక్రసీ నాయకుల పేర్లతో పత్రికా ప్రకటనలు 2007 (వార్త నవంబరు 30 జిల్లా ఎడిషన్) ఇచ్చారు. 1997 బూటకపు ఒప్పందాన్ని గమనించిన ఆరెండు గ్రామాల జనం దీనితో వీరి బండారాన్నీ అర్థంచేసుకున్నారు. మరల గిరిజన సంఘం వద్దకు వచ్చారు. ఏ కొక్కెర చంద్రయ్య అయితే అక్కడికి సంఘాన్ని తెచ్చాడో ఆయన వర్థంతి సభలో మరల సంఘం జెండా నీడన రెండు గ్రామాలు చేరాయి. దీనిలో సంఘం సాగులోవున్న 300 పైచిలుకు గిరిజన కుటుంబాలలో ప్రతికుటుంబానికి ఒక ఎకరం ఇచ్చి మిగిలినదానిని ప్రభుత్వం తీసుకోవచ్చని, నిర్వాసితులకు ఇవ్వడానికి అవతలిపక్కన సరిపల్లికుంట అనేచోట ఎవరికీ అభ్యంతరంలేని జమీందారు భూమి 360 ఎకరాలు ఉందనీ దాన్ని నిర్వాసితులకి ఇమ్మనమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొత్తకుంకాల, పాత కుంకాలల్లో సాగులోవున్న గిరిజనులందరికీ భూమిని పంపకం చేసింది. వారందరి పేర్లు నమోదు చేసి సాగు రికార్డులు తయారుచేసింది. వీరందరికీ సాగురికార్డులు ముందు ఇచ్చి తర్వాత పట్టాలు ఇవ్వాలని కోరింది. పెత్తందార్లు కాజేసిన 18 లక్షల రూపాయలను ప్రజలకు లెక్కప్రకారం పంచాలని కోరింది. ఈలోగా పెత్తందార్లు 30 ఎకరాల మామిడితోటను ఒక షావుకారుకు సుమారు 3 లక్షల రూపాయలకు అమ్మేశారు. ఈ తోటను కొనుగోలు చేయవద్దనీ, తమ మధ్య డబ్బుల వివాదం పరిష్కారం గాకుండా, 18 లక్షల రూ॥లు పంపకం జరగకుండా అదే పెద్దల చేతుల్లో డబ్బులు పడరాదని ప్రజలు ఆ షావుకారుని కోరారు. కానీ ఆ షావుకారు మూర్ఖంగా వ్యవహరించాడు. అప్పటికే ఆ తోటను 5 గ్రామాల గిరిజనులు దున్ని, ఎండుపుల్లలు నరికి వుంచారు.

చివరకు 2011 మే నెల వచ్చే సరికి ఆ పంటను తీసుకెళ్ళడం కోసం పెత్తందార్లు, జమీందారు, రెవిన్యూ, పోలీసు అధికారులతో కలసి ఎవరి గ్రామాలు వారికే సామరస్య పూర్వకంగా సమస్య పరిష్కారానికి 16-5-2011న ఎం.ఎల్.ఏ. సమక్షంలో గ్రామసభ జరుగుతుందని గిరిజన సంఘ నాయకులకే నోటీసు పంపారు. నిర్ణయించాల్సింది గ్రామాల సరిహద్దులు కావని, సమస్య సామరస్యంగా, శాశ్వతంగా పరిష్కారం కావాలంటే ఎవరిసాగులో వున్న భూమికి వారికే పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ప్రజలు మాత్రం అకాల వర్షాలతో పంట రాలిపోయే ప్రమాదం వున్నందున 15-5-2011నే ఆ 30 ఎకరాల తోటలోకి ప్రవేశించి, కాయలుకోసి అన్ని గ్రామాలకీ పంచాలని నిర్ణయించారు. పనుల వత్తిడిలో 600మందిపైగా జనం 15-5-11న కుంకాల తోటవద్దకు చేరుకునే సరికి పోలీసులు వచ్చివున్నారు. పోలీసు అధికారులకు ప్రజలు వివరిస్తూ వుండగానే ఇంకోవైపు నుండి ప్రజలు తోటలోకి ప్రవేశించి కాయలు కోయటం ప్రారంభించారు. తోటలో కొంత భాగాన్ని మధ్యాహ్నం వరకూ కోసి అన్ని గ్రామాల ప్రజలు పంచుకొని తీసుకొని పోయారు. తాశిల్దారు, పోలీసు అధికారులు, ప్రజల వాదనలకు సమాధానం చెప్పలేక మౌనం వహించారు. 18-5-2011న గిరిజన సంఘం నాయకత్వాన ఈ గ్రామాల ప్రజలు ప్రాజెక్టు ఆఫీసరును కలిసి పరిస్థితిని వివరించారు.

15-5-2011 పంట స్వాధీనానికి ముందు పెత్తందార్లు కాజేసిన 18 లక్షల రూ॥ల విషయం వివరిస్తూ సంఘం కామ్రేడ్స్ సవలం రాముడు, కలుం గంగాదేవిలు ప్రచురణ కర్తలుగా కరపత్రం ప్రచురించారు. దీనిపై "ఎవరు పెత్తందార్లం"టూ "కొత్తకుంకాల, పాత కుంకాల, కోయనాగంపాలెం ప్రజల" పేరుతో "ఒకపుడు పాలేర్లుగావున్న వారు నాయకులై పోయారని" "బజారు ఆడవాళ్ళు నాయకులై పోయారని" "ఎవరికి పుట్టారో తెలియనివారు" "నీతిజాతీ లేని వాళ్ళంటూ" "రౌడీలు, గూండాలంటూ" కరపత్రం వేసి ప్రచురణకర్తలపేరు లేకుండా పంచారు. దీనిపై ఏజన్సీ గిరిజన సంఘం పెత్తందార్ల నీచ ప్రచారాన్ని ఖండించమని కోరుతూ అట్టడుగు జనం నాయకులుగా నూతన గిరిజనోద్యమం అభివృద్ధి చెందుతుంటే పెత్తందార్లంతా ఎంత మండిపోతున్నారో అర్థం చేసుకొమ్మని, గిరిజన దళిత ఐక్యతను వీరు ద్వేషిస్తున్నారని, ఒకపుడు పాలేర్లుగా బతికిన అందరూ, భూములు స్వాధీన పరుచుకున్నాక రైతులుగా మారుతున్నారని, ఉత్పత్తి పెరిగిందని వివరించింది. పోరాట వారసత్వంగా కలుం గంగాదేవి ఆమె తండ్రి కోటవీరాస్వామి 1948 నాటి జమిందారీ వ్యతిరేక పోరాటాన్ని కరపత్రం గుర్తుచేసి పోరాట వారసత్వం మాదని ప్రకటించింది. అడుగడుగునా భూస్వామ్య పెత్తందారీ స్వభావాన్ని గిరిజనుల పెద్దలుగా వున్నవారు ఎలా పొందారో వారి కరపత్రమే వెల్లడి చేస్తున్నదని గిరిజన సంఘం పేర్కొంది. ఒకపుడు సి.పి.ఎం., న్యూడెమోక్రసి నాయకులుగా తిరిగిన వారే గిరిజన పెద్దల పేరుతో గిరిజనులను వ్యతిరేకిస్తూ జమీందారుతో 'ఒప్పందాల'కి వెళుతున్నారని, ఇలాంటి నీచమైన భాషలో కరపత్రం వేశారంటే ఆ పార్టీలవద్ద ఏ మహిళా దృక్పథం వీరు నేర్చుకున్నారని, ఒక ఎర్రజెండాను దెబ్బతీసేందుకు ఇంకో ఎర్రజెండా ముసుగుకింద సి.పి.ఎం., న్యూడెమోక్రసీ ముసుగులు ధరిస్తున్నారని వీరిని ఆ పార్టీలు గమనించాలని, ఖండించాలని వివరిస్తూ గిరిజన సంఘం కరపత్రం వేసింది.

దాని కొనసాగింపుగా 25-5-2011న పెత్తందార్ల బెదిరింపులను లెక్కచేయక 30 ఎకరాల తోటలో మిగిలిన పండ్ల స్వాధీనం కోసం వందలాదిమంది కదిలారు. తాశీల్దారు దొండపూడి వచ్చేసరికి దొండపూడి నుండి కుంకాల వరకు సుమారు 5 కిలో మీటర్ల పొడవునా కాయలు కోసుకొని మోసుకొని వస్తున్న జన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ప్రజలు చెప్పినట్లే మామిడి తోటలలో పండ్లను, వచ్చిన ప్రజలందరికీ పంపకం చేసుకొని వెళ్ళారు. ఈ చర్య పెత్తందార్లకు, సరిహద్దుల పేర గ్రామాలను చీల్చి మొత్తం భూపోరాటాన్ని దెబ్బతీయాలనుకున్న భూస్వామ్య శక్తులకి ఒక ఎదురుదెబ్బగా నిలిచింది. అయినా కొత్త, సరికొత్త కుట్రలతో వారు ప్రజల పోరాట ఫలితాలను వమ్ము చేసేందుకు ప్రయత్నిస్తూవున్నారు, ఇక ముందువుంటారు. జనం కూడా పోరాటఫలితాలను రక్షించుకునేందుకు నిరంతరం అప్రమత్తతతోనే వుండాల్సి వుంటుందని ఈ అనుభవాలు తెలియజేస్తున్నాయి.

**-జనశక్తి విలేఖరి** D

# కాంట్రాక్టు సాగు దోపిడీ పద్ధతికి గురౌతున్న పామాయిలు రైతాంగం

**కంపెనీతో** పంటకు చెల్లించే ధరను నిర్ణయించుకుని, ఆ పంటను వేసే కాంట్రాక్టు సాగు పద్ధతి రైతాంగానికి ప్రయోజనకారి అని ప్రభుత్వం ప్రచారం సాగించటమే కాక రైతాంగాన్ని కాంట్రాక్టు సాగు వైపు నెట్టే విధానాలనే అమలు చేస్తున్నది. ప్రభుత్వ ప్రచారంతోనూ, ప్రోత్సాహంతోనూ ఆకర్షితులైన రైతాంగాన్ని ఈ కంపెనీలు బంధిత ఉత్పత్తిదారులుగా మార్చి దోపిడీ చేసుకుంటాయన్న దానికి పామాయిలు రైతుల అనుభవమే ఒక చేదు ఉదాహరణ.

గతకొన్ని నెలలుగా రాష్ట్రంలో పామాయిల్ పంట రైతులకు-మిల్లు యజమానులకు పంటకు ధర చెల్లింపు విషయంలో వివాదం తలఎత్తింది. ఇది పరిష్కారంకాని పరిస్థితుల్లో వివాదాన్ని పరిష్కరించాలని జాతీయ ఆయిల్‌పాం పరిశోధనా కేంద్రంను కేంద్రప్రభుత్వం ఆదేశించింది. ఈ సంస్థ రెండుసార్లు ఇద్దరితో చర్చలు జరిపినా పరిష్కారం కుదరక పామాయిల్ పంట ధర నిర్ణయంలో జాప్యం జరుగుతున్నది. రైతాంగం నష్టపోతున్నారు.

ప్రైవేటు నూనె మిల్లుల యజమానులు, టన్ను గెలల నుండి పామాయిల్ ఉత్పత్తికి 3500 నుండి 4 వేల వరకు ఖర్చు అవుతుందని అందువలన ధరను పెంచలేమని చెప్పటం మోసపూరితంగా ఉంది. ప్రస్తుత మిల్లు యజమానులు టన్ను గెలలకు 6054 రూ॥ చెల్లిస్తున్నారు. పంటకు ఉత్పత్తి ఖర్చులు పెరగటం వలన ఈ ధర రైతాంగానికి గిట్టుబాటు కావటం లేదు. మిల్లు యజమానులు చెబుతున్న ఉత్పత్తి ఖర్చులు వాస్తవంకాదని ఆయిల్ ఫెడ్ సంస్థ లెక్కలు తెలియచేస్తున్నాయి. దీని క్రింద రెండు ఆయిల్ మిల్లులు ఉన్నాయి. ఆయిల్ ఫెడ్ లెక్కల ప్రకారం టన్ను గెలల నుండి నూనె ఉత్పత్తికి 1850 రూ॥ ఖర్చు అవుతుంది. దీన్ని గమనిస్తే ప్రైవేటు నూనె మిల్లు యజమానులు ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ చెప్పటం పంటకు చెల్లించే ధరను పెంచకుండా ఉండేందుకేనని స్పష్టమౌతున్నది. ఆయిల్ ఫెడ్ లెక్కల ప్రకారం టన్ను గెలల నుండి 175 కేజీల నూనెతో పాటు 100 కిలోల ఆయిల్ పాం గింజలు వస్తాయి.

పామాయిల్ పంట ఖర్చులను అంచనా వేయటానికి జాతీయ ఆయిల్‌పాం పరిశోధనా సంస్థ క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిపి కేంద్రానికి పంపిన నివేదికలో టన్ను గెలలు పండించటానికి 8146 రూ॥ ఖర్చు అవుతుందని, వ్యయం ధరల కమీషన్ లెక్కల నిబంధనల ప్రకారం టన్నుకి 13,500 రూ॥ పంట ఖర్చులు అవుతాయని తెలిపింది. ఈ లెక్కల ప్రకారం గిట్టుబాటుగాని ధరలతో పామాయిల్ రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు.

తమకు అవసరమైన పంటలకు మొదట రైతాంగాన్ని ఆకర్షించేలా చేయటం, ఆ పంటలు వేయటానికి అలవాటుపడిన తర్వాత, వారిని దారుణంగా దోచుకోవటం బడా పరిశ్రమాధిపతులు విధానంగా పెట్టుకొన్నారు. పాలకులు అందుకు పూర్తిగా సహకరిస్తున్నారు. తెల్లబంగారంగా ముద్దుపేరుతో పిలవబడిన పత్తిపంటకు మొదట ఆకర్షణీయమైన ధర ఇవ్వటంతో పాటు రైతులను అనేక రకాలుగా ప్రోత్సహించారు. చెరకు పంటకు రైతాంగం మళ్లే విధంగా రైతులను అనేక రకాలుగా ప్రోత్సహించారు. విత్తనం, ఎరువులు ఉచితంగా యిచ్చారు. పంటఖర్చుల కోసం ఎకరానికి 5వేల పైబడి వడ్డీలేని రుణాలు యిచ్చారు. వాటికి తోడు ప్రోత్సాహక ధరను ప్రకటించారు. ఈ పంటలకు రైతాంగం బంధించబడిన తర్వాత రైతాంగానికి యిచ్చే ప్రోత్సాహక రాయితీలను ఉపసంహరించారు. తక్కువధర చెల్లించటం ప్రారంభించారు. దీనికితోడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతాంగానికి నష్టదాయకంగా మారాయి. మరొక వైపు పంట ఖర్చులు పెరిగి, ఆ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడి రైతాంగం నష్టాలపాలై అప్పుల ఊబిలో కూరుకు పోయారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగం ప్రత్యామ్నాయ పంటల గురించి అలోచిస్తున్న తరుణంలో ఆ సంవత్సరం రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా ధరను చెల్లించడం ద్వారా రైతాంగాన్ని, తిరిగి ఆశల్లోకి నెట్టడం, మరుసటి సంవత్సరం ధరను తగ్గించటం, ఈ విధంగా ఒక వలయంలో బంధించి బయటకురాలేని పరిస్థితి కల్పిస్తున్నారు. సుబాబుల్ రైతాంగాన్ని ఈ విధంగానే చేశారు. ఇప్పుడు పామాయిల్ రైతాంగానికి ఇదే పరిస్థితి ఏర్పడింది.

చెరకు పంటను మొదట ప్రోత్సహించినట్లుగానే పామాయిల్ పంటను కూడా ప్రభుత్వం ప్రోత్సహించింది. కేంద్ర జీవసాంకేతిక పరిజ్ఞాన (బయోటెక్నాలజీ) విభాగం మలేసియా నుండి విత్తన సామాగ్రి తెప్పించింది. దేశంలోని నర్సరీలను అభివృద్ధి పర్చి, మొక్కలతో పాటు, ఎరువులు, డ్రిప్ పరికరాలు, ప్లాస్టిక్ సామాగ్రిలాంటి వాటిని సబ్సిడీపై రైతులకు అందచేసింది. ఈ సబ్సిడీ ఎకరానికి 10 వేల దాకా లభించింది. దీనితోపాటు పంటకు కిలోకు రెండు రూపాయల సబ్సిడీ యివ్వటంతో రైతులు ఆయిల్‌పాం పంట విస్తీర్ణాన్ని బాగా పెంచారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.50 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను పండిస్తుంటే, ఒక్క పశ్చిమగోదావరిలోనే లక్షా పదివేల ఎకరాల్లో పంట పండిస్తున్నారు.

రాష్ట్రంలో పామాయిల్ పంట విస్తరిస్తున్న సమయంలోనే భారత ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయటంతో దిగుమతులపై ఆంక్షలు తొలగి పోయాయి. ఫలితంగా పామ్‌ఆయిల్ పంట రైతుల పరిస్థితి తలక్రిందులైయింది. మలేషియాలో అమ్ముడు పోకుండా పేరుకుపోయిన అమెరికా కంపెనీల పామ్‌ఆయిల్ నిల్వలను కేజీ పదిరూపాయలకే కుప్పలు తెప్పలుగా భారత దేశంలోకి దిగుమతి చేసింది. ఫలితంగా దేశంలోని వంటనూనె గింజలు పండించిన రైతాంగం నష్టపోవటంతో పాటు పామాయిల్ పంట ధరలు తగ్గిపోయాయి. రైతాంగానికి నష్టం వచ్చింది. 6 వేలు దాకా ఉన్న టన్ను గెలల ధర 4,119 రూ॥ పడిపోవటం, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను ఉపసంహరించుకోవటం, సేద్యం ఖర్చులు పెరిగిపోయి, పెట్టిన ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఏర్పడటం వలన రైతాంగం సాగు విస్తీర్ణం తగ్గి పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది.

దేశంలో పామాయిల్ పంటతోపాటు నూనె గింజల ఉత్పత్తి తగ్గిపోవటం, తిరిగి పాంఆయిల్ ధర పెరగటం, దేశంలోకి దిగుమతులు పెరుగుతూ ఉండటంతో విదేశీ సంస్థలు భారత దేశంలో వంటనూనెల రిఫైనరీల ఏర్పాటుతో పాటు, పామాయిల్ ఉత్పత్తి నూనెమిల్లులను ఏర్పాటు చేశారు. విదేశాల నుండి ముడిపాం ఆయిల్‌ని దిగుమతి చేసుకొని హోల్‌సేల్ అమ్మకాలతో పాటు ఉప ఉత్పత్తులను ప్రారంభించి విపరీత లాభాలు గడించాయి.

ఆయిల్ పాం పంట నుండి రాష్ట్ర రైతాంగం వెనక్కి మళ్లుతూ ఉండగా 2005 నుండి ప్రపంచ వ్యాపితంగా ఆయిల్‌పాం పంట ధరలు పెరగటం ప్రారంభించి రైతాంగాన్ని ఆ పంటపై మరోసారి మొగ్గుచూపే విధంగా చేసింది. రైతాంగం పంట విస్తీర్ణం పెంచుతూ వచ్చారు. పామాయిల్ మిల్లులతో పంట విక్రయ ఒప్పందాలు చేసుకొన్నారు. టన్ను గెలకు 6 వేలు దాకా ధర లభించింది. ఇంతకు మించి ధర పెరగకపోవటం వలన, పంటఖర్చులు పెరగటం వలన, గిట్టుబాటుకాని పరిస్థితి ఏర్పడి రైతాంగం నష్టపోతున్నారు. అందుకే పంటరేటుని పెంచాలని, లేని ఎడల ఈ పంట సాగుని మానివేస్తామని రైతాంగం ఆందోళన చేస్తున్నారు.

నూనె ఉత్పత్తుల కొరత మూలంగా 52 లక్షల టన్నుల వంట నూనెలను దిగుమతి చేసుకొంటున్నాం. ఇది దేశ అవసరాల్లో సగంగా ఉంది. 16 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చుచేయవలసి వస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో నూనెగింజలు ఉత్పత్తి చేస్తున్న రైతాంగాన్ని పోత్సహించి నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించటానికి చర్యలు తీసుకోకుండా, ఉత్పత్తులు పడిపోయే విధానాలు ప్రభుత్వం అనుసరిస్తున్నది. పామాయిల్ పంట రైతులు కోరుతున్న న్యాయమైన ధరను మిల్లర్లు చెల్లించే విధంగా చర్యలు తీసుకోకుండా, ఒప్పందం ప్రకారం పామాయిల్ గెలను మిల్లులకు రైతులు విక్రయించాలని చెప్పటం ద్వారా రైతు ప్రయోజనాలు గాలికి వదిలివేసి మిల్లు యజమానుల ప్రయోజనాలే ముఖ్యమని ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్రంలో నూనెల ఉత్పత్తికి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆయిల్ ప్లాంట్ ఏర్పాటు, అనంతపురంలో వేరుశనగనూనె ఉత్పత్తికోసం ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఆయిల్‌ఫెడ్ ప్రతిపాదనను పాలకమండలి తిరస్కరించటం నూనె మిల్లుల ప్రయోజనాల కోసమే.

నూనె గింజల ఉత్పత్తిని పెంచాల్సిన ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని ఆయిల్‌పాం పంట రైతులు కోరుతున్న న్యాయమైన ధరను మిల్లు యజమానులు చెల్లించే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. దేశ ఉత్పత్తులు, పంట ఖర్చులకు అనుగుణంగా కేంద్రమే పామాయిల్ పంట ధరను నిర్ణయించాలి. బహుళజాతి సంస్థల దోపిడీని అరికట్టి, పామాయిల్ రైతులతోపాటు నూనె గింజలు పోత్సహించాలి. ఈ దిశగా నూనె గింజలు ఉత్పత్తి చేస్తున్న రైతాంగం సమైక్యంగా ఉద్యమించాలి. D

### సవరణ

గత సంచిక (5-6-2011) జనశక్తి 3వ పేజీలో 'అరబ్‌దేశాలలో ప్రజావెల్లువ' వ్యాస ప్రారంభంలో 'తూర్పున ఎర్రసముద్రం నుండి మధ్యధరా సముద్ర దక్షిణ భాగం మీదుగా పశ్చిమాన ఫసిఫిక్ మహాసముద్రం వరకూ'....అనే వాక్యంలో **ఫసిఫిక్** బదులు అట్లాంటిక్ అని వుండాలి. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాము.

-సంపాదకుడు

కరపత్రం

# రైతులకు సరిపడా నాణ్యమైన పత్తి విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని పోరాడుదాం!

ప్రభుత్వం, బి.టి. పత్తి విత్తన కంపెనీలకు లొంగిపోయింది. బి.టి. కంపెనీల వత్తిడికి తలఒగ్గి విత్తనాల ధరలు బి.టి.-1ని రు. 830 లకు, బి.టి.-2 ను రు. 930 లకు ధరలు పెంచుతూ నిర్ణయం చేసింది. అయినా బి.టి. పత్తివిత్తన కంపెనీలు సంతృప్తి చెందటంలేదు. వారంతా ముందుగానే విత్తన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు తరలించారు. మొత్తం వ్యవసాయ సంక్షోభం, పంటల ధరలలో అనిశ్చితితో ఒకోసారి ఒక్కో పంటకు డిమాండ్ ఏర్పడేలా పాలకులు, దళారీలు, బడా కంపెనీలు వ్యూహాలు పన్నుతారు. ఇప్పుడు పత్తిపంటకు గిరాకీ పెంచారు. దీనితో రాష్ట్రంలో పత్తి సాధారణ విస్తీర్ణం 30 లక్షల ఎకరాలు ఉంటే గత సంవత్సరం 43 లక్షల ఎకరాలైంది. ఈ సంవత్సరం 50 లక్షల ఎకరాలను దాటిపోతుంది. వరంగల్ జిల్లాలో పత్తి పంట అంటే బి.టి. పత్తే. 2002-03లో 1500 ఎకరాలలో ప్రారంభమైన బి.టి. పత్తి పంట గత సంవత్సరం 5 లక్షల ఎకరాలకు చేరింది. ఈ సంవత్సరం 6 లక్షల ఎకరాలకు చేరబోతున్నది. మొత్తం వరంగల్‌జిల్లాలో 55 శాతం సాగుభూమిలో ఒక్క పత్తి పంటే సాగవుతోంది.

రాష్ట్రం మొత్తంమీద ఈ సం॥ అవసరాలకు తగ్గట్టు 91 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు కావాలి. ఇప్పటికి 1 కోటి 46 లక్షల విత్తన ప్యాకెట్లు ఉత్పత్తి అయి ఉన్నాయి. వరంగల్ జిల్లాలో చూస్తే సుమారు 11 లక్షల 50వేల ప్యాకెట్లు కావాలి. విత్తన డీలర్లు ఎక్కువ డిమాండ్ ఉన్న మహికో, నూజివీడు, మోన్‌శాంటో తదితర కంపెనీల ప్యాకెట్లకి 300 రూ॥ చొప్పున ముందే చెల్లించారు. మహికో 5 లక్షల ప్యాకెట్లు సరఫరా చేసేలా, నూజివీడు 2 లక్షల 50 వేల ప్యాకెట్లు, మోన్‌శాంటో 1 లక్షా 10వేల ప్యాకెట్లు-ఈ విధంగా వివిధ కంపెనీలకి ముందుగానే సుమారు 15 కోట్ల రూపాయలను డీలర్లు చెల్లించి విత్తనాలను రిజర్వు చేసుకొన్నారు. కానీ ధరలు పెరిగినా సరే మహికో తను ఒప్పుకొన్న 5 లక్షల ప్యాకెట్లకుగానూ లక్షా 55వేల ప్యాకెట్లను మాత్రమే అంటే ఒప్పందంలోని 30 శాతం ప్యాకెట్లనే సరఫరా చేస్తానని చెబుతోంది. మిగిలిన నూజివీడు, మోన్‌శాంటో, ప్రభావతి తదితర కంపెనీలు ఒప్పుకొన్న దానిలో 50 శాతం విత్తనాలనే సరఫరా చేస్తామని చెప్తున్నారు. ఒకపక్క తొలకరి సమీపిస్తుండగా రైతుల జీవితాలతో, వ్యవసాయంతో ఈ కంపెనీలు ఎంత దుర్మార్గంగా చెలగాటమాడుతున్నాయో అర్థం అవుతుంది.

## ఈ దుస్థితికి మూలం ఎక్కడ ?

మన దేశ విత్తన ఉత్పత్తి రంగం బహుళజాతి కంపెనీల చేతుల్లోకి పోయినతర్వాత అవి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను సైతం శాసించగలుగుతున్నాయి. కాంగ్రెస్, బిజెపి కూటమిలు రెండూ తాము అధికారంలో ఉన్న కాలంలో ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరడం, తద్వారా మేధోహక్కుల ఒప్పందాలపై సంతకం చేయడంతో పేటెంట్ హక్కుల పేరిట బిటి విత్తన కంపెనీలే విత్తన రంగాన్ని ఏలుతున్నాయి. నిజానికి నూతన వంగడాలను, విత్తనాలను కనుగొనేది, అభివృద్ధిపరిచేదీ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు. పత్తి బి.టి వంగడాలను నాగపూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇతర యూనివర్శిటీల నుంచి నూతన విత్తనాలను అభివృద్ధి చేసినా బహుళజాతి కంపెనీలకు లొంగిన ప్రభుత్వాలు రైతు విత్తన హక్కును తాకట్టు పెట్టాయి. నిజానికి నైజాం జమానానో దేశముఖ్‌లు, దొరలు రైతుల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన రోజుల్లోకూడా రైతు తన విత్తనం మీద, పండించే వరకన్నా పంటమీద పూర్తి హక్కుతో స్వేచ్ఛగా ఉన్నాడు. పండిన పంటను దొరలు - నిజాం దోచుకుపోతుంటే విధిలేక చివరకు తిరగపడ్డాడు. కానీ నేటి రైతుకు తన విత్తనం మీద, ఎరువుల-పురుగుమందుల మీద, చివరకు తను పండించిన పంటను ఏ రేటుకు అమ్ముకోవాలనే దానితో సహా ఎక్కడా ఏ హక్కూలేని పరిస్థితి ఉంది. తన పొలంలో రైతు ఇప్పుడున్నంత పరాధీనంగా ఎప్పుడూలేడు. ఇప్పుడు కోల్పోయినంతగా గుర్తింపును ఎప్పుడూ కోల్పోలేదు. గ్రామీణ సంపన్న వర్గాల వడ్డీదోపిడీ, విత్తనం నుంచి పంట వరకూ పట్టణ దళారీ బడా మార్కెట్ వర్గాల దోపిడీ అనే తిరగలి రాళ్ళమధ్య రైతు నిస్సహాయంగా, శారీరకంగా, మానసికంగా వంటరివాడుగా మిగిలి పోతున్నాడు. ఈ నిస్సహాయతే రైతును ఆత్మహత్యల వైపు నెడుతున్నది. పురుగు మందుల్ని పెరుగన్నంలా తినేలా చేస్తున్నది.

రైతులు, కూలీలు గ్రామాలలో తమ కష్టార్జితంతో ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తి ఫలితాలను ఎవరు కొల్లగొడుతున్నారో చెప్పమని నిగ్గదీయాలి. విత్తన కంపెనీల బ్లాక్ మెయిలింగ్, ప్రభుత్వాల లొంగుబాటుతనాలను ఖండించాలి. విత్తనంపై హక్కు రైతుదేనని ప్రభుత్వం ప్రకటించాలి. విత్తన వ్యాపారులపై ప్రైవేటు గుత్తాధిపత్యాలను రద్దుచేయాలి. నాణ్యమైన దేశీయ విత్తనాలను ఎవరు అభివృద్ధి పరిచినా చౌకగా లభించేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలని, మేధోహక్కుల చట్టం నుంచి భారతదేశం బయటకు రావాలని మనం డిమాండు చేయాలి. విత్తన కంపెనీలు కేంద్రప్రభుత్వం పేర, విత్తన బిల్లు పేర ఏ ప్రభుత్వమూ వాటి ధరలలో, నాణ్యతలో జోక్యం చేసుకోకుండా తేవాలనుకుంటున్న బిల్లును ప్రవేశపెట్టరాదని, విత్తనాలపై రైతులను నిలువుదోపిడీ చేసే హక్కు ఎవరికీ లేదని ప్రభుత్వం ప్రకటించాలి. రైతు ఉద్యమ బలహీనతలవల్లే ప్రతి వ్యవసాయక సంక్షోభం రైతులను మరింత పరాధీనులుగా చేయడానికి ప్రభుత్వానికి, బడా విత్తన కంపెనీలకు అవకాశం దొరుకుతోంది. 1980-2000 మధ్య పత్తి రైతుల ఆత్మహత్యల సంక్షోభాన్ని ఉపయోగించుకొని తోడేలు వెనుకే పెద్దపులి వచ్చినట్లు బి.టి. కంపెనీలు వచ్చాయి. మన నేలను, రైతును, వ్యవసాయాన్ని, కలుషితం చేసి కబళిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో రైతు, కూలీలు, కార్మికులు మేధావుల ఐక్యతతో వ్యవసాయాన్ని-పల్లెల్ని పరిరక్షించుకునేందుకు విత్తుమొదలు పంటవరకూ రైతు హక్కు సాధించుకునేందుకు పేద రైతుకూలీ, మధ్యతరగతి, యావత్ గ్రామీణ ప్రజానీకం సంఘటితం కావాలని కోరుతున్నాం. ప్రభుత్వం తక్షణమే కదలి నాణ్యమైన పత్తి విత్తనాలను తక్కువ రేట్లకు రైతులకు సరఫరా చేయించాలని, బడాకంపెనీల దౌర్జన్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

**రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**
**28-5-11** **వరంగల్ జిల్లా** D

**నివేశన స్థలాలకై...** (చివరి పేజీ నుండి)

మీపై కేసులుపెట్టి జైలుకి పంపిస్తానని' బెదిరించడం లాంటి చర్యలకు పూనుకున్నాడు. తన వద్ద ఉన్న ఏదో నకిలీపట్టాను చూపిస్తూ ప్రజలు భూమిని చదును చేసి గుడిసెలు వేసుకొనుచుండగా పోలీసులను, రెవిన్యూ అధికారులను తీసుకువచ్చి పోలీసులతో హడావుడి చేయించాడు.

అయినా సంఘం ఆధ్వర్యంలో, ప్రజలు నిబ్బరంగా నిలబడి పోలీసుల దురుసుతనాన్ని ప్రతిఘటించి రెవిన్యూ అధికారులతో చర్చలు జరిపారు. ఈ చర్చలలో రికార్డులను పరిశీలించవలసిందిగా వత్తిడి చేయడంతో రెవిన్యూ అధికారులు-పోలీసుల, ప్రజల సమక్షంలో పేదలు ఇండ్లు వేసుకొంటున్న స్థలంవద్దనే పరిశీలన చేశారు, ఈ భూమి వెంకటరెడ్డిది అయినట్లు రికార్డు పూర్వకంగా ఏ ఆధారమూలేకపోవడంతో, ఈ భూమిపై వెంకటరెడ్డికి ఏ విధమైన హక్కూ లేదని, ఈ భూమి రెవిన్యూ పోరంబోకు భూమి అని బహిరంగంగా ప్రకటించారు. వెంటనే ప్రజలు సదరు భూమిని నిరుపేదలకు ఇండ్లస్థలాలకి కేటాయించాలని, కొలతలు కొలిచి వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, స్థలం తనదంటూ ఇప్పటిదాకా ప్రజలను, ప్రభుత్వాన్ని, పోలీసులను తప్పుదోవ పట్టించిన వెంకటరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఈ భూమి తప్పనిసరిగా ప్రజలకు కేటాయించి 20 రోజులలో ప్లాట్లు పెట్టి పంపకం చేస్తామని హామీయిచ్చారు. ప్రభుత్వ అధికారుల అలసత్వాన్ని ఎరిగిన ప్రజలు మరుసటి రోజే ప్లాట్లు పెట్టుకొని గుడిసెలను నిర్మాణం చేసుకున్నారు. ఈ కాలనీకి అమరుడు కా॥ అంగడి చెన్నయ్య కాలనీగా పేరు పెట్టుకున్నారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం నాయకులు కామ్రేడ్ పాటిబండ్ల కోటేశ్వరరావు, సురభి అమరలింగం, బుట్టి మరియదాసు, పాలకుర్తి అంజయ్య; గ్రామకమిటి సభ్యులు బత్తుల కొండలు, దేవంగుల అంజయ్య, వెంకటేశ్వర్లు, నాగమ్మ, మహంకాళి లక్ష్మి, తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. D

కాంతి కేంద్రాలా! మృత్యు మందిరాలా ?
పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక
వెల: రు. 15/-
మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి, ఏలూరురోడ్, విజయవాడ

# శ్రీకాకుళం-చౌదరి సత్యన్నారాయణ కాలనీలో అగ్నిప్రమాదం
## సహాయ, పునరావాస చర్యలకు డిమాండ్


అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన ఇళ్ళు; బాధితులను పరామర్శిస్తున్న కామ్రేడ్స్ ఝాన్సీ, వర్మ, అరుణ

**శ్రీకాకుళం, 8-6-11 :**

స్థానిక చౌదరి సత్యన్నారాయణ కాలనీలో 8-6-2011 మధ్యాహ్నం 3 గంటలకు అగ్ని ప్రమాదం జరిగి, నిరుపేద కూలీనాలీ చేసుకొని జీవిస్తున్న వారి 57 ఇళ్ళు పూర్తిగా కాలిపోయాయి. కట్టుబట్టలు తప్ప బాధితులు సర్వం కోల్పోయారు. రెక్కలు ముక్కలు చేసుకొని ఒక్కొటొక్కటి సమకూర్చుకున్న సామానులు, తమకున్న కొద్దిపాటి ఆస్థి తమ కళ్ళ ఎదుటే మంటలకు ఆహుతయ్యి బూడిదగా మారుతుంటే నిస్సహాయులుగా మిగిలిపోయారు. బట్టలు, వంట సామాగ్రి, రకరకాల పొదుపు బాండ్లు, టీవీలు, సర్టిఫికెట్లు, నగదు, బంగారం, వస్తువులు బూడిద అయ్యాయి. నిరాశ్రయులుగా మారిన బాధితుల రోదన వర్ణానాతీతంగా ఉంది. సమయానికి అగ్నిమాపక దళం రాకపోవడం వలనకూడా నష్టం పెరిగింది.

అగ్నిప్రమాదం జరిగిన వెంటనే పలువురు కాలనీకి విచ్చేసి అగ్నిబాధితులకు రాత్రిభోజన వసతి ఏర్పాట్లు చేశారు. వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. సహాయ సహకారాలందించిన వారందరికీ బాధితులు ధన్యవాదాలు తెలియజేశారు. ఇది అగ్నిప్రమాదం కాదని, ప్రజలే కాలబెట్టుకున్నారన్న తప్పుడు ప్రచారాలని ఖండించి, ఆ శక్తుల దుర్బుద్ధిని వెల్లడిచేశారు.

అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి చౌదరి సత్యనారాయణకాలనీ అగ్నిబాధితుల సహాయకమిటీ ఏర్పడింది. కా॥ టి. అరుణ కన్వీనర్‌గా 13 మందితో ఈ కమిటీ ఏర్పడింది. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు సహాయ సహకారాలను అందించాలని ప్రజాతంత్ర వాదులకు, దాతృత్వ సంస్థలకు బాధితుల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ కమిటీ ప్రభుత్వపరంగా ఈ క్రింది డిమాండ్ల సాధనకు కృషి చేస్తుంది. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అన్ని విధాలుగా ప్రభుత్వ యంత్రాంగం ముఖ్యంగా రెవిన్యూ, మున్సిపాలిటీ, ఎలెక్ట్రిసిటీఅధికారులు యుద్ధ ప్రాతిపదికపై కదలి ఈ క్రింది విధంగా పునరావాస చర్యలను చేపట్టాలని కమిటీ డిమాండ్ చేసింది.

1. బాధిత కుటుంబాలన్నింటినీ వెంటనే ఆదుకోవాలి. 2. నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను వెంటనే అందజేయాలి. 3. టార్పాలిన్‌లను, వంట పాత్రలను బాధిత కుటుంబాలకు తక్షణమే అందజేయాలి. 4. రేషన్‌కార్డులను, పింఛన్ కార్డులను వెంటనే ఇవ్వాలి. 5. కాలిపోయిన ఇళ్ళ స్థానంలో పక్కా ఇళ్ళను కట్టించి ఇవ్వాలి. 6. విద్యార్థులకు కాలిపోయిన సర్టిఫికెట్ల బదులుగా డూప్లికేటు సర్టిఫికెట్లు అందజేయాలి. 7. కాలిపోయిన ఇళ్ళల్లో గ్యాస్ కనెక్షన్ ఉన్న వారికి గ్యాస్ కనెక్షన్‌లను వెంటనే ఇవ్వాలి. 8. కాలిపోయిన ఇన్సూరెన్స్, పొదుపు, పోస్టల్ తదితర బాండ్లన్నింటినీ సర్వేచేసి కొత్తగా ఇప్పించాలి. 9. బాధిత కుటుంబాలకు ఉచితంగా కరెంటు మీటర్లను సరఫరా చేసి కరెంటు సరఫరాను పునరుద్ధరించాలి. D

## చేనేత కార్మికుల సమస్యలపై సదస్సు

**గూడూరు, 30-5-11 :**

**ప్రజాతంత్ర** చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో 'చేనేతరంగ పరిరక్షణ కోసం-జీవించే హక్కు కోసం' అనే అంశంపై సభ జరిగింది. ఈ సభకు ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర.) కప్పలదొడ్డి ఏరియా నాయకులు కా॥ పేరిశెట్టి విఘ్నేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ ఈనాటి పాలకులు అవలంబిస్తున్న దోపిడీ విధానాలవల్లే చేనేత కార్మికుల ఆత్మహత్యలు పెరిగాయనీ, కానీ వ్యక్తిగత కారణాలవల్లే చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆశాఖకు సంబంధించిన మంత్రులు అనడం విడ్డూరంగావుందన్నారు. వరల్డ్‌బ్యాంక్ ఆదేశాలతో కేంద్ర, రాష్ట్ర పాలకులు అమలు చేస్తున్న నూతన ఆర్థిక సంస్కరణలవల్ల అన్ని వర్గాల ప్రజలు-ముఖ్యంగా చేనేత కార్మికులు సంక్షోభంలో పడి సతమతవుతున్నారనీ, వ్యవసాయరంగం తరువాత దేశంలో 1.2 కోట్లు; రాష్ట్రంలో 30 లక్షలు; జిల్లాలో 21 వేలమందికి ఉపాధి కల్పిస్తున్న చేనేతరంగం ఈనాడు అనేక సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. నూతన జౌళి విధానంను అనుసరించి కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి, ఆటోలూమ్స్- జెట్‌లూమ్స్‌ను దిగుమతి చేసుకుందనీ, దీనివల్ల చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయారనీ, దేశంలో 25 కోట్లువున్న చేనేత కార్మికులు 1.2 కోట్లకు తగ్గారంటే ఆధునీకరణ, యాంత్రీకరణ ప్రభావం ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతుందన్నారు.

చేనేత వస్త్రాలకు మార్కెట్లో గిరాకి ఉంది కాని కార్మికుల కూలి పెంచేందుకు యజమానులు అంగీకరించటంలేదనీ, కార్మికుల ఆలోచనలను నిరంతరం ఋణ మాఫీ చుట్టూ తిప్పుతూ విధివిధానాలపేర నిత్యం వారిని గందరగోళపరుస్తూ గడిచిన బడ్జెట్‌లో చేనేతకు కేటాయింపులు ఎగవేస్తూవచ్చారనీ, చేనేతకు ప్రాణాధార మైన చిలపలనూలు ఉత్పత్తి తగ్గించి వేశారనీ, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం క్రింద చేనేత కార్మికులకు రుణాలను మాఫీ చేయలేదనీ, బ్యాంకులు అప్పులు తీర్చమని నోటీసులు జారీ చేస్తున్నాయనీ, ప్రభుత్వం కేటాయించిన 327 కోట్లు ఏమైనట్టు? అని ప్రశ్నించారు. కప్పలదొడ్డిలో 11 మంది చేనేత కార్మికులు ఆదరణ పథకం క్రింద తీసుకున్న రుణాలు మాఫీ అయినాయి అని నోటీసులు పంపించారు. బినామీలుగా అధికారులు, దళారులూ కలిసి రుణాలను కైవసం చేసుకొన్న కుంభకోణంపై ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర.) ఆందోళన చేసింది. ఈ స్థితిలో **చేనేత రంగం పరిరక్షణకోసం చేనేత రంగాన్ని మొత్తంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సామూహిక మగ్గాలతో షెడ్లను నిర్మించి, చేనేత కార్మికులందరికీ ఉపాధి చూపించి ప్రభుత్వమే జీతాలు చెల్లించే విధంగా చేనేత రంగాన్ని ఒక కార్పోరేషన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేద్దాం** అని పిలుపునిచ్చారు.

ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర.) నాయకులు కా॥ ఆకురాతి సతీష్ ప్రసంగిస్తూ 1991లో నూతన ఆర్థిక విధానాల అమలులో భాగంగా పెద్దపెద్ద మిల్లులను అనుమతించారనీ వాటికి అనేక రాయితీలు ఇచ్చారనీ, ఆధునిక యంత్రాలపై, వస్త్ర ఉత్పత్తులపై నియంత్రణను ఎత్తివేశారనీ, ఫలితంగా చేనేత ఎదుర్కొంటున్న సంక్షోభం మరింత ఎక్కువైందన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. జగన్, ఏపిఎఫ్‌టియు బందరు ఏరియా నాయకులు కా॥ ఎం. సుధాకర్, కొర్నిపాటి వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. ప్రజా కళాకారులు, బాలకాళాకారులు పాటలు పాడారు, నృత్యరూపకం ప్రదర్శించారు. ఈ సభకు చుట్టుప్రక్కల బ్రహ్మపురంకాలనీ, కప్పలదొడ్డి, ఆకులమన్నాడు ప్రజలు, చేనేత కార్మికులు 200 మంది పాల్గొన్నారు. D

## కౌలు రైతులపై దేవాదాయశాఖ అధికారుల వేధింపులకు నిరసన


గుంటూరులో రైతుకూలీల ప్రదర్శన

**రెంటచింతల, 5-6-11 :**

రెంటచింతల మండలంలోని దేవాలయ మాన్యం భూముల కౌలు రైతులు కౌలు చెల్లించడం ఆలస్యమైందనే సాకుతోవారిని దేవాదాయశాఖ అధికారులు వేధింపులకు, సాధింపులకు, అవమానాలకు గురిచేస్తున్నారు.

కౌలు రైతులపట్ల దేవాదాయశాఖ వారి తీరు అమానవీయంగాను, అనుచితంగాను ఉన్నది. దేవాదాయ శాఖ అధికారుల వేధింపులను తీవ్రంగా ఖండిస్తూ రై.కూ.సం (అం.ప్ర.) ఆందోళనకు పూనుకుంది.

గత పదిహేను సంవత్సరాలుగా కౌలురైతులు ప్రతిసంవత్సరమూ క్రమం తప్పకుండా అనుకున్న మేరకు దేవాదాయశాఖకు కౌలు చెల్లిస్తూ వస్తున్నారు. ఈ సంవత్సరం సంభవించిన ప్రకృతి వైపరీత్యాల మూలంగా ఆరుగాలం కష్టించి రెక్కలు ముక్కలు చేసుకొని అప్పో సొప్పో చేసి పండించిన పంటంతా సర్వనాశనమైంది. కొద్దోగొప్పో పండిన దాళ్వావరిపంటను అమ్మి కౌలు చెల్లిద్దామను కున్న కౌలు రైతుకు ఆ పంటను కొనేనాథుడు లేక, సరైన గిట్టుబాటుధర లేక కారు చౌకగా తెగనమ్ముకో వలసి వచ్చింది. ధాన్యం అమ్మి ఇప్పటికి దాదాపు నెలరోజులు అవుతున్నా ధాన్యం కొన్న గుత్తేదారు ఇప్పటికీ రైతుకు డబ్బులు యివ్వక ఇంకా నెలరోజులు గడువు పెడుతున్నాడు.

రెంటచింతల మండల దేవాదాయశాఖ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ నరేష్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ నిరుపేదలైన మాన్యం భూముల కౌలుదారులను కౌలు చెల్లించడం ఆలస్యమయిందనే నెపంతో అక్రమంగా కేసులు బనాయించడానికి ప్రయత్నం చేయడం, కౌలు రైతులను జైలుకి పంపిస్తానని, కోర్టులకు నడిపిస్తానని, కౌలు ఆలస్యం అయ్యింది గనుక వడ్డీ, చక్రవడ్డీలతో సహా కోర్టు ఖర్చులు కలిపి ముక్కు పిండి వసూలు చేస్తానని బెదిరింపులకు పూనుకున్నాడు. అదీ చాలదన్నట్లు కౌలు రైతులను దొంగలుగా, నేరస్థులుగా పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించడం సిగ్గుచేటైన విషయం.

బ్రిటీష్ దొరలు, నైజాం రజాకార్లు, జమీందారులు భారత రైతాంగం పట్ల వ్యవహరించిన తీరుకి, ఈ అధికారి కౌలురైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకి తేడా ఏమాత్రం లేదు. ఈ అధికారి కౌలు రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరుని ఖండించవలసినదిగా ప్రజలకు, ప్రగతికాములకు, ప్రగతిశీలవాదులకు, రైతు మద్దతుదారులకు రై.కూ.సం. (ఆం.ప్ర.) కరపత్రం ద్వారా విజ్ఞప్తి చేసింది.

దేవాదాయశాఖ అధికారుల రైతాంగ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ మాన్యంభూముల కౌలుదారుల కౌలును రద్దు చేయాలని, కౌలు రైతులపై అధికారుల వేధింపులను ఆపివేయాలని, మాన్యం భూములకు కౌలు వేలం పాటలనుపెట్టే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం స్థానిక నాయకులు పి. సత్తయ్య, బుట్టి మరియదాసు, అచ్చిరెడ్డి, పెద్దిరెడ్డి, భోజ్యా నాయక్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు, 13-6-11 :**

దేవాదాయ మాన్యం భూముల కౌలును రద్దు చేయాలని, వరదలు, తుఫానుల వలన పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే యివ్వాలని, కౌలు ఒప్పంద పత్రంతో సంబంధం లేకుండా భూస్వాముల, ధనిక రైతుల భూములను కౌలుకి సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులకే నేరుగా పంటనష్టపరిహారం యివ్వాలని, కౌలుదారులకు గుర్తింపు కార్డులను, ఋణాలను, ఎరువులు, విత్తనాలను, కౌలు రైతులకే అందివ్వాలని, ప్రైవేటు అప్పులపై మారిటోరియం ప్రకటించాలని, ప్రస్తుత ఖరీఫ్ పంటకి కౌలు రైతులకు , రైతులకు సబ్సిడీ ధరలపై విత్తనాలను, మందులను సకాలంలో అందివ్వాలని, విత్తనాల అమ్మకాలను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని, దళారుల, మార్కెట్ శక్తుల దోపిడీని అరికట్టాలని, వ్యవసాయ రంగంలో విదేశీ బహుళ జాతి కంపెనీల, సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్యాలను అరికట్టాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులవద్ద ఉన్న వరి నిల్వలను క్వింటా 1500/-రూ॥కు కొనుగోలు చేయాలని, కౌలు రైతులపై దేవాదాయశాఖ రెంటచింతల మండల అధికారి సాగిస్తున్న వేధింపులను అరికట్టమనే పలురకాల కౌలు రైతుల, రైతుల డిమాండ్స్‌పై వందలాది మంది కౌలు రైతులు గుంటూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి ఎండోమెంట్ కార్యాలయం వద్ద మరియు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి సంబంధిత అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు.

ఈ కార్యక్రమానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, అధ్యక్షులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి, జిల్లానాయకులు కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు, కె. ముసలయ్య, మండవ శోభారాణి, కా॥ నీలాద్రి రాంబాబు, దూపాటి శ్రీను, మారెళ్ళ అంజిరెడ్డి, దానబోయిన భాస్కరరావు, జక్కంపూడి పద్మ, వెంకటేశ్వర్లు, రెంటచింతల మండల నాయకులు, రైతులు నాయకత్వం వహించి ధర్నా కార్యక్రమంలో రైతులనుద్దేశించి మాట్లాడారు.

## నివేశన స్థలాలకై ఆందోళన
## కామ్రేడ్ అంగడి చెన్నయ్య కాలనీ ఏర్పాటు


ఇళ్ళ స్థలాల స్వాధీనానికై తరలివెళుతున్న ప్రజలు

**రెంటచింతల, 10-6-11 :**

రెంటచింతల మండలం జెట్టిపాలెం గ్రామంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో పేద ప్రజలందరూ అందోళనద్వారా ఒక కాలనీని ఏర్పాటు చేసుకున్నారు.

గ్రామంలోని మేగపోతుల వెంకటేశ్వరరెడ్డి అనే పెత్తందారు అధీనంలో గత 70 సం॥ పైగా ఉన్న ప్రభుత్వ రెవిన్యూ పోరంబోకు భూమిని ప్రజలు సంఘటిత శక్తితో పోరాడి సాధించుకున్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) గ్రామకమిటి సభ్యులు తొలుత గ్రామంలోని ఇండ్లస్థలాలు లేని పేదలందరితో సమావేశాలు జరిపి సర్వేనంబరు 376/బి-3లో ప్రభుత్వ రెవిన్యూ పోరంబోకు స్థలం ఉన్నదని, దానిని పేదలకు కేటాయించాలని కోరుతూ మండల తహశీల్దార్ కార్యాలయం వద్దకు ప్రదర్శన-ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. తదుపరి జరిగిన గ్రామ రెవిన్యూ సదస్సులో 200 మందితో ప్రదర్శనగా వెళ్ళి మెమోరాండం ఇచ్చారు.

ఈ క్రమంలో ఆ భూమిని ఎన్నో సం॥లుగా తన అధీనంలో ఉంచుకున్న వెంకటరెడ్డి ప్రజలను పలురకాలుగా భయపెట్టడం, కేసులు బనాయించడానికి ప్రయత్నం చేయడం, పోలీసులతో వచ్చి కట్టిన ఎర్రజెండాలను తొలగించడం, 'నాకు పట్టావుంది కోర్టుకెళ్ళైనా

(తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010